thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal


| సంపుటి : 21 | సంచిక : 159 | జగిత్యాల ఆదివారం 13 సెప్టెంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

మంధాన మరో మైలురాయి..




11

## ఆరేళ్ల చిన్నారిపై ఘోరం




- మేనమామకు మరణశిక్ష
- అత్యాచారం, హత్య కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పు
- 17 నెలల్లోనే పూర్తయిన కేసు విచారణ

4

## 65 ఏండ్ల వృద్ధుడికి ఉరి శిక్ష



- మూడేళ్ల బాలికపై లైంగికదాడి కేసులో మరణ దండన
- పూణె ఫాస్ట్ ట్రాక్ కోర్టు సంచలన తీర్పు

2

## క్యూర్ బిల్లుకు మండలి ఆమోదం

- కోర్ అర్బన్ రీజియన్ 2026 బిల్లుకు గ్రీన్‌సిగ్నల్
- హైదరాబాద్ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ నిర్ణయం



4



4

ఐరాస భద్రతా మండలి సంస్కరణలకు

## గళమెత్తిన కూటమి

- చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోదీ కీలక భేటీ

## అతిథి దేవో భవ

విదేశీ నేతలకు ప్రత్యేక వెండి పాత్రల్లో భారతీయ రాజసం వంటకాలు

జకీర్ నాయక్ అప్పగింతపై

## చర్చించాం





- మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ప్రకటన
- బ్రిక్స్ సదస్సు వేదికగా ప్రధాని మోదీతో ద్వైపాక్షిక భేటీలో జకీర్ ప్రస్తావన

4

# బ్రిక్స్‌లో 'న్యూఢిల్లీ' ఏకతాటిపై!

సంయుక్త ప్రకటనకు సభ్య దేశాల ఏకగ్రీవ ఆమోదం

- యుద్ధం కాదు.. చర్చలు, దౌత్యమే మార్గమని స్పష్టీకరణ
- ఐరాస భద్రతా మండలిలో సంస్కరణలకు పిలుపు
- మానవాభివృద్ధికే అగ్రతాంబూలం అన్న ప్రధాని మోదీ
- ప్రపంచ నేతలతో వరుస ద్వైపాక్షిక భేటీలు

ప్రపంచ ఆర్థిక, రాజకీయ యవనికపై శరవేగంగా మారుతున్న సమీకరణల నడుమ భారత అధ్యక్షతన ఢిల్లీ వేదికగా జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు విశ్వశాంతికి, ప్రపంచ మానవాళి సంక్షేమానికి సరికొత్త దిశను నిర్దేశిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఆహారం, ఇంధనం, ఆరోగ్యం, విపత్తుల నిర్వహణ, కీలకమైన సరఫరా వ్యవస్థల పరిరక్షణే లక్ష్యంగా సాగుతున్న ఈ రెండు రోజుల సదస్సు ప్రారంభ సమావేశంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రసంగం చేశారు. బ్రిక్స్ ఏర్పడి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంలో, ఈ వేదిక పరిపక్వత సాధించి సరికొత్త ప్రతిష్ఠాత్మక అజెండాతో కొత్త దశలోకి అడుగుపెడుతోందని ఆయన అభివర్ణించారు. బ్రిక్స్ ఏ రకమైన వర్గానికీ వ్యతిరేకం కాదని, అందరినీ కలుపుకొని ముందుకు సాగడమే దీని ప్రధాన విధానమని స్పష్టం చేశారు. *- న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (చురకలు)*




వివరాలు 4వ పేజీలో..



2

## గణేశ్ ఉత్సవాలపై నిరంతర నిఘా

- మున్సిపల్-పోలీస్ శాఖల సమన్వయం
- ప్రత్యేక అధికారుల నియామకానికి ఆదేశం
- కమాండ్ కంట్రోల్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్
- మండపాలకు ఉచిత విద్యుత్: సీఎం రేవంత్
- నిమజ్జనానికి చెరువుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

## తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ




### సస్పెన్షన్లకు నిరసనగా బీఆర్ఎస్ నమూనా సభ

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సెటైర్ల వర్షం!
- స్పీకర్‌గా జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు
- 'సీఎం' పాత్రలో తలసాని శ్రీనివాస్ యాదవ్
- కొండా సురేఖ తొలగింపుపై వ్యంగ్యాస్త్రాలు
- వంద రోజుల హామీలపైనా చురకలు

3

## దసరా కానుకగా కొత్త పింఛన్లు

- రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల మందికి అవకాశం
- ఇంటింటికీ వెళ్లి అర్హుల పరిశీలన
- ఈ నెలాఖరులోగా క్షేత్రస్థాయి తనిఖీలు
- వచ్చే నెల తొలివారంలో తుది జాబితా



2



2

### కొత్త రైళ్ల కొనుగోలుకు పచ్చజెండా

మెట్రో ప్రయాణికులకు శుభవార్త

- 600 కోట్ల వ్యయంతో కొత్త రైళ్ల కొనుగోలు
- రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ నిర్ణయం

## తెలంగాణకు మరో వారం వానలే!

- రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- 24 గంటల్లో పలుచోట్ల భారీ వర్షాలకు అవకాశం
- ఆరు జిల్లాల్లో వర్షాల ప్రభావం అధికం
- హైదరాబాద్‌లోనూ మోస్తరు వానలు
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచన



తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది.

2

## నిరుద్యోగులకు టీజీపీఎస్సీ షాక్

2

- 2022 ఉద్యోగ నోటిఫికేషన్ రద్దు
- 544 పోస్టుల ప్రకటనకు బ్రేక్
- నోటిఫికేషన్ 33/2022 రద్దు
- పాత ప్రకటనతో నియామకాలు లేనట్టే
- త్వరలోనే కొత్త నోటిఫికేషన్






# నిరుద్యోగులకు టీజీపీఎస్సీ షాక్

## 2022 ఉద్యోగ నోటిఫికేషన్ రద్దు

## 544 పోస్టుల ప్రకటనకు బ్రేక్

## నోటిఫికేషన్ 33/2022 రద్దు

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (చురకలు):** ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక సమాచారం వెల్లడించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీ కోసం 2022లో జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. మొత్తం 544 ఖాళీల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ నంబర్ 33/2022ను తక్షణమే రద్దు చేసినట్లు వెబ్‌నోట్‌లో వెల్లడించింది. కాలేజియేట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీ కోసం 2022 డిసెంబర్ 31న టీజీపీఎస్సీ బ్రీఫ్ నోటిఫికేషన్ నంబర్ 33/2022ను విడుదల చేసింది. దీని ద్వారా మొత్తం 544 ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించింది. అయితే ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన కమిషన్.. అన్ని పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన అనంతరం పాత ప్రకటనను పూర్తిగా రద్దు చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. దీంతో 2022 నాటి బ్రీఫ్ నోటిఫికేషన్ ఆధారంగా ఇకపై నియామక ప్రక్రియ కొనసాగదని అభ్యర్థులు గుర్తించాలని సూచించింది.

### త్వరలో కొత్త ప్రకటన

పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసిన నేపథ్యంలో ఆయా పోస్టుల భర్తీకి త్వరలోనే కొత్త నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. కొత్త ప్రకటన వెలువడిన తర్వాత అందులో పేర్కొనే పోస్టుల సంఖ్య, అర్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, దరఖాస్తు తేదీలు, ఎంపిక విధానం తదితర వివరాలను అభ్యర్థులు పరిశీలించాలని సూచించింది. కొత్త నోటిఫికేషన్ ప్రస్తుత నిబంధనలు, రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్ విధానాలకు అనుగుణంగా రూపొందించే అవకాశం ఉంది. దీంతో డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు మరోసారి కొత్త నోటిఫికేషన్ కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# కొత్త రైళ్ల కొనుగోలుకు పచ్చజెండా

## మెట్రో ప్రయాణికులకు శుభవార్త

**హైదరాబాద్, సెప్టెంబర్ 12:** హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. మెట్రో రైళ్లల్లో రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం మందడుగు వేసింది. ప్రస్తుతం పీక్ సమయాల్లో మెట్రోలలో విపరీతమైన రద్దీ ఉంటుంది. కనీసం నిల్చోవడానికి కూడా స్థలం ఉండటం లేదు. ఈ సమస్యతో మెట్రో ప్రయాణికులు ఎప్పటినుంచో ఇబ్బంది పడుతుండగా.. ఇప్పుడు పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధమైంది. రద్దీని తగ్గించేందుకు కొత్త రైళ్లను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం కొత్త రైళ్లను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రెడీ అవుతోంది. ఒక్కో రైల్లో 2 వేల మంది ప్రయాణించేందుకు వీలుగా 6 కోచ్‌ల రైళ్లను ప్రవేశపెట్టనుంది. తొలి దశలో 60 కోచ్‌లను కొనుగోలు చేయనుండగా.. ఆరు కోచ్‌లతో కూడిన 10 కొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకొస్తారు. ఒక్కో రైలుకు రూ.60 కోట్ల వరకు ఖర్చు కానుంది. 60 కోచ్‌ల కొనుగోలుకు రూ.600 కోట్ల వరకు వ్యయం కానుందని అంచనా వేశారు. త్వరలోనే కొత్త రైళ్ల కోసం టెండర్లను ఆహ్వానించనున్నారు. బిడ్ల కోసం నోటిఫికేషన్ జారీ చేసిన తర్వత తుది వ్యయం ఎంత అవుతుందనేది తెలియనుంది. ప్రస్తుతం ఉన్న మెట్రో రైళ్లల్లో మూడు కోచ్‌లు మాత్రమే అందుబాటులోకి ఉన్నాయి. దీంతో ఒకేసారి వెయ్యి మంది మాత్రమే ప్రయాణించడానికి వీలు కలుగుతుంది. అదే ఆరు కోచ్‌లు అందుబాటులోకి వస్తే ఒకేసారి 2 వేల మంది ప్రయాణించవచ్చు. ప్రయాణికుల సంఖ్య దాదాపు రెట్టింపు అవుతుంది. వీటి వల్ల ఒకేసారి ఎక్కువమంది ప్రయాణికులకు తమ గమ్యస్థానాలకు చేర్చవచ్చు. ఎక్కువ కోచ్‌లు కలిగిన రైళ్లు ఉండటం వల్ల ప్రయాణికుల రద్దీ కూడా తగ్గుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ విపరీతంగా ఉండటం వల్ల కనీసం అడుగు వేసేందుకు కూడా ఖాళీ స్థలం ఉండటం లేదు. దీని వల్ల ఇబ్బంది పడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. కొన్నిసార్లు తర్వాతి రైలు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ప్రస్తుతం మెట్రోలో రోజూ 4.5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. అయితే కొత్త మెట్రో రైళ్లు వస్తే 6 లక్షల వరకు పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. అమీర్ పేట-రాయదుర్గం మార్గంలో ఎక్కువ రద్దీ ఉంటుంది. ఉదయం ఆఫీసులకు వెళ్లే సమయంలో, సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల రాయదుర్గం స్టేషన్‌లో కొన్నిసార్లు ప్రయాణికులకు కొద్దిసేపు ఆపాల్సి వస్తోంది. రద్దీని నియంత్రించేందుకు అధికారులు ఈ ప్రయత్నం చేస్తున్నారు. దీంతో కొత్త రైళ్లను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇవి అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. సౌకర్యవంతంగా ప్రయాణం చేయవచ్చు.



# గణేశ్ ఉత్సవాలపై నిరంతర నిఘా

## మున్సిపల్-పోలీస్ శాఖల సమన్వయం

## ప్రత్యేక అధికారుల నియామకానికి ఆదేశం

## కమాండ్ కంట్రోల్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్

## మండపాలకు ఉచిత విద్యుత్: సీఎం రేవంత్

## నిమజ్జనానికి చెరువుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (చురకలు):** హైదరాబాద్ మహానగరంలో గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉత్సవాల పర్యవేక్షణ, వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. శాసనసభ ఆవరణలోని మండలి సమావేశ మందిరంలో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో సీఎం సమీక్షించారు. గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ ప్రశాంతంగా ఉన్నప్పుడే పెట్టుబడులు వస్తాయని, ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. గణేశ్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు సాఫీగా సాగేందుకు నిర్వాహకులు ప్రభుత్వ యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. ఉత్సవాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఎదురైనా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గణేశ్ ఉత్సవాలకు సంబంధించి గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామని సీఎం తెలిపారు. నిర్వాహకుల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకే తాను సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

### అతిథుల వివరాలు ముందే చెప్పాలి

గణేశ్ మండపాలకు ప్రముఖులు, అతిథులను ఆహ్వానించిన సందర్భాల్లో వారి వివరాలను ముందుగానే స్థానిక పోలీస్ కమిషనరేట్‌కు అందించాలని నిర్వాహకులకు సీఎం సూచించారు. దీనివల్ల అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాటు అనుకోని పరిణామాలు ఎదురైనా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టేందుకు వీలవుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో గణేశ్ మండపాలకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. అయితే మండప నిర్వాహకులు సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందాలని సూచించారు. మండపాలను ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారనే సమాచారాన్ని ముందుగానే పోలీసులకు అందిస్తే ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణ సులభమవుతుందని చెప్పారు.

### చెరువుల వద్ద క్రేన్లకు ప్రత్యేక ఏర్పాట్లు

అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మలకు ఏర్పాటు చేసిన తరహాలోనే గణేశ్ నిమజ్జనాలకు అవసరమైన సదు-పాయాలను నిర్మాణ దశలోనే కల్పించాలని సీఎం ఆదేశించారు. నిమజ్జన ప్రక్రియ సాఫీగా సాగేందుకు చెరువుల చుట్టూ క్రేన్లను ఏర్పాటు చేసుకునేలా ప్రత్యేక ప్రదేశాలు, అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, నగర ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, హైడ్రా కమిషనర్లు, పోలీసు ఉన్నతాధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఒక్క క్లిక్‌తో హైడ్రా సేవలు

## అందుబాటులోకి అధికారిక వెబ్‌సైట్

## అత్యవసర సహాయం నుంచి చెరువుల వివరాల దాకా

## వర్షపాతం.. వరద ప్రాంతాలకు ప్రత్యేక మ్యాప్‌లు

## అగ్నిమాపక అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (చురకలు):** హైదరాబాద్ నగరంలో విపత్తు నిర్వహణ, చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు హైడ్రా కీలక అడుగు వేసింది. ప్రజలకు పలు రకాల సేవలను ఒకే వేదికపై అందించే అధికారిక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం కొత్త పోర్టల్‌ను ప్రారంభించారు. హైడ్రా సేవలు, కార్యకలాపాలు, అత్యవసర సహాయం, వాతావరణ పరిస్థితులు, చెరువులు, భూములు, అధికార పరిధి తదితర వివరాలను ఇకపై ఒకే చోట తెలుసుకోవచ్చు. చెరువుల హద్దులు, కాలువలు, ప్రభుత్వ భూములు, విపత్తు నిర్వహణకు సంబంధించిన సమాచారంతోపాటు హైడ్రా అధికారిక ప్రకటనలు, క్షేత్రస్థాయి కార్యక్రమాలు, చెరువుల పునరుద్ధరణ వివరాలను పోర్టల్‌లో పొందుపరిచారు.

### అత్యవసరమైతే 1070

హైడ్రా 24 గంటల అత్యవసర సహాయ సంఖ్య 1070ను పోర్టల్‌లో ప్రత్యేకంగా అందుబాటులో ఉంచారు. చెట్లు కూలడం, అగ్ని ప్రమాదాలు, రహదారులపై నీరు నిలవడం, వరదలు, సహాయక చర్యలు అవసరమైన సందర్భాలతోపాటు ఇతర విపత్తులపై ప్రజలు ఈ నంబర్‌కు సమాచారం అందించవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు ఇది ఉపయోగపడనుంది. అగ్నిమాపక భద్రత నిరభ్యంతర పత్రాల కోసం కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సదుపాయం కల్పించారు. భవన యజమానులు, నిర్మాణదారులు దరఖాస్తు చేయడంతోపాటు అది ఏ దశలో ఉందో తెలుసుకోవచ్చు. అధికారులు ప్రత్యేక డ్యాష్‌బోర్డు ద్వారా దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.

### వరద ప్రాంతాలు ముందే తెలుసుకోవచ్చు

భారీ వర్షాలు, వరదల సమయంలో నీరు నిలిచే ప్రాంతాలను ముందుగానే గుర్తించేందుకు ప్రత్యేక మ్యాప్‌లను పోర్టల్‌లో పొందుపరిచారు. జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నీరు నిలిచే, వరద ప్రభావానికి గురయ్యే ప్రాంతాలను వేర్వేరుగా పరిశీలించవచ్చు. ప్రత్యక్ష వర్షపాతం మ్యాప్‌లు, రోజువారీ వర్షపాతం వివరాలు, వాతావరణ అంచనాలు, హైదరాబాద్ డాప్లర్ రాడార్ సమాచారాన్ని కూడా అందుబాటులో ఉంచారు. భారీ వర్షాల సమయంలో ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకునేందుకు ఇవి ఉపయోగపడనున్నాయి.

### చెరువుల హద్దులు.. భూముల వివరాలూ

హైడ్రా వెబ్‌సైట్ నుంచి హెచ్‌ఎండీఏ చెరువుల పోర్టల్‌కు నేరుగా వెళ్లే సదుపాయం కల్పించారు. చెరువులు, జలాశయాలకు సంబంధించిన పూర్తి నీటిమట్టం హద్దులు, బఫర్ జోన్ వివరాలను పరిశీలించవచ్చు. చెరువుల పరిసరాల్లో నిర్మాణాలు చేపట్టే ముందు వర్తించే నిబంధనలను తెలుసుకునేందుకు ఈ సమాచారం ఉపయోగపడుతుంది. తెలంగాణ ప్రభుత్వ భూభారతి పోర్టల్‌కు కూడా నేరుగా అనుసంధానం కల్పించారు. భూముల కొనుగోలు లేదా ఇతర లావాదేవీలకు ముందు సర్వే నంబర్, పట్టాదారు వివరాల ఆధారంగా అందుబాటులో ఉన్న భూ రికార్డులను పరిశీలించుకునే అవకాశం ఉంటుంది. హైడ్రా పునరుద్ధరించిన చెరువులు, చేపట్టిన పరిరక్షణ కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పనుల తాజా సమాచారాన్ని కూడా పోర్టల్‌లో పొందుపరిచారు. వార్తలు, తాజా సమాచారం, ఫొటోలు, వీడియోల ద్వారా హైడ్రా కార్యకలాపాలను ప్రజలు ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ఏర్పాట్లు చేశారు.

# దసరా కానుకగా కొత్త పింఛన్లు

## దసరా కానుకగా కొత్త పింఛన్లు

## రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల మందికి అవకాశం

## ఇంటింటికీ వెళ్లి అర్హుల పరిశీలన

## ఈ నెలాఖరులోగా క్షేత్రస్థాయి తనిఖీలు

## వచ్చే నెల తొలివారంలో తుది జాబితా

## ప్రభుత్వం ఆమోదించగానే పింఛన్ సొమ్ము పంపిణీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (చురకలు):** తెలంగాణలో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 2.50 లక్షల పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. దసరా కానుకగా వాటిని పంపిణీ చేసేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ చేపట్టగా, లక్షల సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల్లో అర్హులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు అధికారులు నేరుగా వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. కుటుంబ పరిస్థితి, ఆదాయం, ఇతర అర్హతలను తనిఖీ చేయనున్నారు. ఈ నెలాఖరులోగా పరిశీలన ప్రక్రియను పూర్తి చేసి, వచ్చే నెల తొలి వారంలో అర్హుల తుది జాబితాను సిద్ధం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వం ఆమోదం తెలిపిన అనంతరం దసరా నుంచి కొత్త పింఛన్ల సొమ్ము అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇందుకు అవసరమైన బడ్జెట్‌ను కూడా కేటాయించినట్లు తెలుస్తోంది.

### ఆగస్టు 9 నుంచి దరఖాస్తులు

కొత్త పింఛన్ల కోసం ఆగస్టు 9 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తుండగా.. గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగించారు. తొలుత ఈ నెలలోనే పరిశీలన పూర్తి చేసి పింఛన్లు మంజూరు చేయాలని భావించినప్పటికీ క్షేత్రస్థాయి పరిశీలన, అవసరమైన ధ్రువీకరణ పత్రాల జారీలో ఎదురైన సమస్యల కారణంగా ప్రక్రియ ఆలస్యమైనట్లు సమాచారం. దివ్యాంగులు, డయాలసిస్ బాధితులు, ఫైలేరియా బాధితులు, చేనేత, గీత కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళల అర్హతలను నిర్ధారించేందుకు సంబంధిత పత్రాలు అవసరం. ఒంటరి మహిళలు విడాకులకు సంబంధించిన పత్రాలు, కోర్టు ఉత్తర్వులతోపాటు ఏడాదిగా ఒంటరిగా ఉంటున్నట్లు ధ్రువీకరణ సమర్పించాల్సి ఉంటుంది. వితంతువులు భర్త మరణ ధ్రువీకరణ పత్రాన్ని అందించాల్సి ఉంటుంది. అయితే భర్త మరణించి ఎక్కువకాలమైన వితంతువులు మరణ ధ్రువీకరణ పత్రాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గీత, చేనేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు కూడా సంబంధిత శాఖల నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందడంలో సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. ప్రాథమికంగా ధ్రువీకరణ పత్రాలు లేకుండానే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. తర్వాత జరిగే అర్హతల పరిశీలన సమయంలో మాత్రం అవసరమైన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.



### ప్రస్తుతానికి 2.50 లక్షల మందికే..

ప్రస్తుతం 2.50 లక్షల కొత్త పింఛన్లకు మాత్రమే ప్రభుత్వం ఆమోదం తెలిపిన నేపథ్యంలో అంతమంది అర్హులనే ఎంపిక చేయనున్నారు. వచ్చిన దరఖాస్తుల్లో పూర్తి అర్హతలు ఉన్నవారిని ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేయనున్నారు. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తిచేసి తుది జాబితాను ప్రభుత్వానికి పంపనున్నారు. ప్రభుత్వం ఆమోదం తెలిపిన తర్వాత పింఛన్ల పంపిణీ ప్రారంభం కానుంది. దీర్ఘకాలంగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో దసరా నుంచి పింఛన్లు అందనున్నాయన్న సమాచారంతో అర్హుల్లో ఆశలు పెరిగాయి.

# తెలంగాణకు మరో వారం వానలే!

## రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

## 24 గంటల్లో పలుచోట్ల భారీ వర్షాలకు అవకాశం

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచన

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (చురకలు):** తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలకు అవకాశం ఉందని తెలిపింది. నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు ఉపయోగించడం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, కాచి చల్లార్చిన నీటినే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని అధికారులు సూచించారు.

# తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ

- సస్పెన్షన్లకు నిరసనగా బీఆర్ఎస్ నమూనా సభ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సెటైర్ల వర్షం!
- స్పీకర్‌గా జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు
- 'సీఎం' పాత్రలో తలసాని శ్రీనివాస్ యాదవ్
- కొండా సురేఖ తొలగింపుపై వ్యంగ్యాస్త్రాలు
- వంద రోజుల హామీలపైనా చురకలు





**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (చురకలు):** అసెంబ్లీ నుంచి తమ ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను నిరసిస్తూ బీఆర్ఎస్ వినూత్న నిరసనకు దిగింది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం 'మాక్ అసెంబ్లీ' నిర్వహించింది. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి తీరును లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ నేతలు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రభుత్వం చర్చకు అనుమతించడం లేదని ఆరోపిస్తూ పలు ప్రజా సమస్యలను నమూనా సభలో ప్రస్తావించారు. ఈ మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు స్పీకర్‌గా వ్యవహరించగా.. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సీఎం పాత్ర పోషించారు. రేవంత్‌రెడ్డి మాట్లాడే తీరును అనుకరిస్తూ ప్రభుత్వంపై సెటైర్లు వేశారు. ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావించిన తలసాని.. ఆమె కుమార్తె తన గురించి మాట్లాడినందుకే ఢిల్లీ వెళ్లి 3 రోజులు ఉండి సురేఖను అణచివేసి వచ్చానన్నట్లుగా వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తాను బీసీ బిడ్డనై సీఎం అయ్యాక ఆమెను మంత్రివర్గం నుంచి తొలగించకుండా ఏం చేయగలనంటూ రేవంత్‌ను అనుకరిస్తూ ఎద్దేవా చేశారు.

### 'ఏ వంద రోజుల్లోనో చెప్పామా?'

కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన వంద రోజుల హామీల అమలుపైనా తలసాని చురకలంటించారు. "వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పాం.. కానీ ఏ వంద రోజుల్లో అని చెప్పామా? ఢిల్లీలో మాకూ కొన్ని ఇబ్బందులు ఉంటాయి కదా" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ప్రవర్తన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై సభలో చర్చ జరపాలని పట్టుబట్టిన నేపథ్యంలో సెప్టెంబర్ 9న కేటీఆర్‌తో సహా 22 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సస్పెండ్ చేశారు. ఈ నిర్ణయాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ నిర్వహించింది. కేటీఆర్‌తోపాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం చర్చకు అవకాశం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ వివిధ ప్రజా సమస్యలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించి నిరసన తెలిపారు.

# ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి
- రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ





**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12:** ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

# మాక్ అసెంబ్లీ.. డెమోక్రసీని మాక్ చేయడమే

### పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (చురకలు):** బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క విమర్శించారు. చట్టసభల పట్ల, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ఆ పార్టీకి ఏ మాత్రం గౌరవం లేదనేది వారి చర్యలతో మరోసారి స్పష్టమైందన్నారు. అసెంబ్లీ లాబీలో మంత్రి సీతక్క శనివారం చిట్ చాట్ చేశారు. ఎర్రవల్లిలో ఎల్పీ సమావేశం నిర్వహించిన బీఆర్ఎస్ నేతలు పార్టీ కార్యాలయంలో మాక్ అసెంబ్లీ నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. అసెంబ్లీకి రావాల్సిన నేతలు పార్టీ కార్యాలయంలో కూర్చుని అసెంబ్లీని అనుకరించడం ప్రజాస్వామ్యాన్ని గౌరవించడమా అని నిలదీశారు. గతంలో ఫామ్‌హౌస్ ముందు దళిత సంఘాలు నిరసన తెలిపినప్పుడు పసుపు నీళ్లతో ఆ ప్రాంతాన్ని శుద్ధి చేసిన ఘటనను మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఇంకా ఆ మైల పోలేదనే ఆధిపత్య దురహంకారంతోనే ఫామ్‌హౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించలేదా అని ప్రశ్నించారు. అసెంబ్లీకి ఎలాగూ రాని కేసీఆర్ బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీకి కూడా రాకపోవడం చూస్తుంటే ఆయనకు చట్టసభల పట్ల, సొంత పార్టీ కార్యక్రమాల పట్ల ఎంత గౌరవం ఉందో అర్థమవుతోందని సీతక్క అన్నారు. కేసీఆర్ అధికారంలో ఉంటే సచివాలయానికి రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారు అని ఆమె ఎద్దేవా చేశారు. ఫామ్‌హౌస్‌ను సచివాలయంగా, పార్టీ కార్యాలయాన్ని అసెంబ్లీగా భావించే పార్టీ బీఆర్ఎస్ తప్ప దేశంలో మరొకటి లేదని విమర్శించారు. ఫామ్‌హౌస్‌లో ఎల్పీ సమావేశం.. పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ సమావేశం.. ఉన్న దగ్గరకే అన్నీ రావాలనుకోవడం దొరల అహంకారానికి నిదర్శనం.. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లు అధికారం పోయినా దొర అహంకారం మాత్రం ఇంకా పోలేదు అని సీతక్క మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీకి ఉందన్నారు. స్పీకర్‌ను, చట్టసభలను అవమానిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని, ప్రతిపక్ష హోదాను ఊడగొట్టడం ఖాయమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# 'రీయింబర్స్‌మెంట్‌పై దాటవేత తగదు'

- 15 వేల కోట్ల బకాయిలు ఎప్పుడిస్తారో చెప్పాలి
- విద్యార్థుల ఖాతాల్లో నగదు జమ చేయాలి
- జీవో 97తో పాలిటెక్నిక్ వ్యవస్థకు ముప్పు
- విద్యార్థులపై లాఠీచార్జి అమానుషం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ధ్వజం



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (చురకలు):** కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని, దాటవేత ధోరణి వీడి బకాయిల చెల్లింపు తేదీని స్పష్టంగా ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు డిమాండ్ చేశారు. శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ.5,430 కోట్లతో పాటు వర్తమాన కాంగ్రెస్ పాలనలో పేరుకుపోయిన బకాయిలు కలిపి మొత్తం రూ.15 వేల కోట్లకు చేరాయని, దీనివల్ల కళాశాలలు సర్టిఫికెట్లు నిలిపివేయడంతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న సీఎం రేవంత్ రెడ్డి ఆ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని రామచందర్ రావు విమర్శించారు. జీవో 97 తీసుకొచ్చి పాలిటెక్నిక్ కోర్సులను ధ్వంసం చేసే కుట్ర జరుగుతోందని, న్యాయమైన డిమాండ్ల కోసం నిరసన తెలుపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులపై క్రూరంగా లాఠీఛార్జ్ చేయించడం అమానుషమని మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలపై సేకరించిన 8 లక్షల వినతిపత్రాలను ఇచ్చేందుకు సమయం కోరితే సీఎం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని ఆరోపించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికి ఆకర్షితులై సూర్యాపేట, హైదరాబాద్ జిల్లాలకు చెందిన రిటైర్డ్ డీసీపీ శ్రీనివాస్ మరియు పలువురు వైద్యులు, ప్రముఖులు బీజేపీలో చేరగా, రామచందర్ రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



# క్యూర్ బిల్లుకు మండలి ఆమోదం

### కోర్ అర్బన్ రీజియన్ 2026 బిల్లుకు గ్రీన్‌సిగ్నల్

### హైదరాబాద్ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ నిర్ణయం

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (చురకలు):** హైదరాబాద్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకొచ్చిన క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్) 2026 బిల్లుకు తెలంగాణ శాసనమండలి ఆమోదం తెలిపింది. శనివారం మండలిలో బిల్లును ప్రవేశపెట్టగా.. సభ్యులు చర్చించిన అనంతరం ఆమోదించారు. అనంతరం శాసనమండలి నిరవధికంగా వాయిదా పడింది. హైదరాబాద్ నగర అభివృద్ధి, పరిపాలనను మరింత సమర్థంగా నిర్వహించాలనే ఉద్దేశంతో క్యూర్ 2026 బిల్లును ప్రభుత్వం రూపొందించింది. 'ఒకే నగరం.. ఒకే పరిపాలన.. ఒకే చట్టం' అనే విధానంతో బిల్లుకు రూపకల్పన చేసినట్టు ప్రభుత్వం తెలిపింది. శనివారం జరిగిన మండలి సమావేశంలో క్యూర్ బిల్లుతోపాటు మొత్తం నాలుగు బిల్లులకు సభ్యులు ఆమోదం తెలిపారు. వివిధ అంశాలపై చర్చించిన అనంతరం బిల్లులకు మండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. తెలంగాణ శాసనమండలి మొత్తం ఆరు రోజుల పాటు కార్యకలాపాలు నిర్వహించింది. ఈ కాలంలో 19 గంటల 20 నిమిషాల పాటు సభ కొనసాగినట్లు ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది.

### 22ఏ నిషేధిత భూముల వివాదంపై శాసనసభలో

# మంత్రి పొంగులేటి స్పష్టత

### ఉమ్మడి రాష్ట్రం నుంచే 22ఏ సమస్య

### ఆన్‌లైన్ అప్‌లోడ్‌లో దొర్లిన పొరపాట్లను సరిదిద్దాం



**హైదరాబాద్, సెప్టెంబర్ 12:** రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల జాబితాపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు కేవలం అసత్య ప్రచారమేనని, 22ఏ సమస్య ఈనాటిది కాదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శాసనసభ వేదికగా స్పష్టం చేశారు. శనివారం శాసనసభలో 22ఏ అంశంపై జరిగిన సుదీర్ఘ చర్చలో ప్రతిపక్షాల ఆరోపణలను ఆయన ఆధారాలు, వీడియో క్లిప్పింగ్స్‌తో ఖండించారు. 2007లో ఉమ్మడి రాష్ట్రంలోనే 22ఏ అమల్లోకి వచ్చిందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే సమస్య సజీవంగా ఉందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2025 డిసెంబర్ 3న డేటా అప్‌లోడ్ చేసే సమయంలో కొన్ని సాంకేతిక పొరపాట్లు జరిగిన మాట వాస్తవమేనని, అయితే వాటిని ప్రభుత్వం తక్షణమే గుర్తించి సరిదిద్దిందని వివరించారు. కూకట్‌పల్లి పరిధిలోని హైదర్‌నగర్ (సర్వే నం. 145, 163, 172), శంషీగూడ (సర్వే నం. 57) వంటి ప్రాంతాలు సుప్రీంకోర్టు మరియు హైకోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నందున 2013 నుంచే పీవోబీ జాబితాలో ఉన్నాయని, కొత్తగా ఏ ఒక్క పట్టా భూమిని ఇందులో చేర్చలేదని మంత్రి ఆధారాలతో నిరూపించారు. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చేనాటికి 22ఏ పరిధిలో 1,02,52,690 ఎకరాలు ఉండగా, నేటికి ఆ విస్తీర్ణం 1,02,05,250 ఎకరాలకు (47,440 ఎకరాలు) తగ్గిందని వెల్లడించారు. 22ఏ వల్ల రిజిస్ట్రేషన్ల రాబడి తగ్గిందనడం అవాస్తవమని, గతేడాదితో పోలిస్తే ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ప్రభుత్వానికి రూ.1,359 కోట్ల మేర రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరిగిందని గణాంకాలతో వివరిస్తూ, త్వరలోనే సమస్యలన్నింటినీ పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### డిసెంబర్ 2027 నాటికి నాగపూర్-వరంగల్

# గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తి

### మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (చురకలు):** తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను అనుసంధానించే అత్యంత కీలకమైన నాగ్‌పూర్ - మంచిర్యాల - వరంగల్ - ఖమ్మం - విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణాన్ని 2027 డిసెంబర్ 31 నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. శనివారం శాసనమండలిలో సభ్యులు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరామ్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. మొత్తం 310 కిలోమీటర్ల నిడివి ఉన్న ఈ భారీ రహదారి ప్రాజెక్టులో 280 కిలోమీటర్ల మేర తెలంగాణ పరిధిలోనే విస్తరించి ఉందని వివరించారు. భూసేకరణ, కోర్టు వివాదాల కారణంగా పనుల్లో కొంత ఆలస్యం జరిగిందని, అయితే ప్రస్తుతం ప్రధాన సమస్యలన్నింటినీ పరిష్కరించామని మంత్రి తెలిపారు. మార్కెట్ ధర ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లిస్తున్నామని, కేవలం ఒకటి రెండు చోట్ల మాత్రమే 1 నుంచి 5 కిలోమీటర్ల పరిధిలో భూమి అప్పగింత పెండింగ్‌లో ఉందన్నారు. కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కూడా ఇటీవల ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక సమీక్ష జరిపారని గుర్తు చేశారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) పర్యవేక్షణలో జరుగుతున్న ఈ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని స్పష్టం చేశారు.

## సంపాదకీయం



# బ్రిక్స్‌కు కొత్త దిశ

## భారత్ చేతిలో భవిష్యత్ అజెండా!

## విశ్వశాంతి.. మానవ సంక్షేమమే లక్ష్యం

ప్రపంచ ఆర్థిక, రాజకీయ యవనికపై శరవేగంగా మారుతున్న సమీకరణల నడుమ భారత్ మరో చారిత్రక ఘట్టానికి ఆతిథ్యమిస్తోంది. ఢిల్లీ వేదికగా జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు విశ్వశాంతి, ప్రపంచ మానవాళి సంక్షేమానికి సరికొత్త దిశను నిర్దేశించే వేదికగా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న వేళ ఆహారం, ఇంధనం, ఆరోగ్యం, విపత్తుల నిర్వహణ, కీలక సరఫరా వ్యవస్థల పరిరక్షణ లక్ష్యంగా రెండు రోజుల సదస్సు సాగుతోంది. సవాళ్లతో కూడిన ప్రపంచ పరిస్థితుల్లో బలమైన అనుసంధానకర్తగా తన నాయకత్వాన్ని చాటుకునేందుకు భారత్ ముందుకు సాగుతోంది. ఈ ఏడాది బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం చారిత్రాత్మకమైనదని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. బ్రిక్స్ ఏర్పడి 20 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో కూటమి కొత్త దశలోకి అడుగుపెడుతోందన్నారు. మానవ జీవితంలో 20 ఏళ్ల వయసు పరిపక్వత, బాధ్యతలు పెరిగే దశకు సంకేతమైతే.. బ్రిక్స్ కూడా ఇప్పుడు పరిణతి దశకు చేరుకుందని వ్యాఖ్యానించారు. గత రెండు దశాబ్దాల్లో ప్రపంచ వేదికపై బ్రిక్స్ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. బ్రిక్స్ ఎవరికీ వ్యతిరేకంగా పనిచేసే కూటమి కాదని, అందరినీ కలుపుకొని ముందుకు సాగడమే దాని విధానంగా ఉండాలని మోదీ స్పష్టం చేశారు. సభ్య దేశాల మధ్య ఐక్యత, ఏకాభిప్రాయాన్ని స్పష్టమైన ఫలితాలుగా మార్చాల్సిన సమయం వచ్చిందన్నారు. భారత్ అధ్యక్షత ప్రజా కేంద్రిత, 'మానవతా ప్రథమ' విధానం ఆధారంగా కొనసాగుతోందని చెప్పారు. సౌలభ్యం, ఆవిష్కరణ, సహకారం, స్థిరత్వం ప్రధాన ప్రాధాన్యతలని వెల్లడించారు. రాబోయే 20 ఏళ్లకు బ్రిక్స్ కొత్త, ప్రతిష్టాత్మక అజెండాతో ముందుకు సాగాలని ప్రతిపాదించారు. ప్రపంచ పాలనలో సంస్కరణలు, గ్లోబల్ సౌత్‌కు సముచిత ప్రాతినిధ్యం, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల్లో మార్పులు ఈ ప్రయాణంలో కీలకంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రపంచ పాలనా వ్యవస్థలో సంస్కరణలకు సమగ్ర మార్గపటం రూపొందించాలని మోదీ సూచించారు. ప్రాతినిధ్యం, స్పందన-జవాబుదారీతనం, నియమాల రూపకల్పన అనే మూడు అంశాలు దీనికి ప్రాతిపదికగా ఉండాలన్నారు. ప్రపంచ వ్యవస్థలో అన్ని దేశాలకు సముచిత ప్రాతినిధ్యం దక్కాలని, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియ మరింత సమగ్రంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రపంచ పరిస్థితులు మారుతున్నప్పటికీ అంతర్జాతీయ సంస్థల్లో ప్రాతినిధ్య వ్యవస్థ మాత్రం అందుకు అనుగుణంగా మారడం లేదన్నారు. ప్రస్తుత ప్రపంచ వాస్తవాలకు అనుగుణంగా అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణలను ఇకపై వాయిదా వేయకూడదని మోదీ పిలుపునిచ్చారు. ఈ అంశంపై చర్చలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా నిర్దిష్ట కాలపరిమితి, స్పష్టమైన ఫలితాలతో ముందుకు సాగాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తున్న దేశాలకు అంతర్జాతీయ ఆర్థిక పాలనలోనూ తగిన పాత్ర దక్కాలన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల్లో ఓటింగ్ హక్కులు, నాయకత్వ పదవులు, విధాన ప్రాధాన్యతలు నేటి ఆర్థిక వాస్తవాలకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రపంచ ఆర్థిక వృద్ధికి కీలకంగా ఉన్న దేశాలకు ప్రపంచ ఆర్థిక పాలనా వ్యవస్థ రూపకల్పనలోనూ సముచిత స్థానం ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి ఏడాది బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు మారుతున్నప్పటికీ సంస్థాగత కార్యక్రమాల వేగం తగ్గకూడదని మోదీ పేర్కొన్నారు. ఇందుకోసం 'కొనసాగింపు--అమలు యంత్రాంగం' ఏర్పాటు చేయాలని భారత్ ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. బ్రిక్స్ కార్యక్రమాలు, నిర్ణయాలు, వాటి ఫలితాలను ట్రోయికా ద్వారా నిరంతరం పర్యవేక్షించవచ్చని సూచించారు. తద్వారా ఒక అధ్యక్ష దేశం నుంచి మరో దేశానికి బాధ్యతలు మారినా గత నిర్ణయాల అమలులో కొనసాగింపు ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచ సంక్షోభాల ప్రభావాన్ని గ్లోబల్ సౌత్ దేశాలు ముందువరుసలో ఎదుర్కొంటున్నప్పటికీ.. అంతర్జాతీయ నిర్ణయాల ప్రక్రియలో మాత్రం అవి వెనుకబడి ఉన్నాయని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి మారాలని స్పష్టం చేస్తూ 'విశేషాధికారాల పిరమిడ్‌ను భాగస్వామ్య వేదికగా మార్చాలి' అని పిలుపునిచ్చారు. ప్రతి దేశం గొంతు వినిపించేలా, ప్రతి సభ్యుడికీ భాగస్వామ్యం ఉండేలా ప్రపంచ వ్యవస్థ మారాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ నిర్ణయాల్లో మానవాళి అభివృద్ధినే కేంద్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. రెండు దశాబ్దాల బ్రిక్స్ ప్రయాణాన్ని కొత్త దశగా అభివర్ణించిన మోదీ.. రాబోయే 20 ఏళ్లలో కూటమిని మరింత ప్రభావవంతమైన, సమగ్ర, ఫలితాల ఆధారిత వేదికగా తీర్చిదిద్దేందుకు భారత్ తరఫున కీలక ప్రతిపాదనలు ముందుంచారు. ముఖ్యంగా ఐరాస సహా అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మార్పులు, గ్లోబల్ సౌత్‌కు సముచిత ప్రాతినిధ్యం, తీసుకున్న నిర్ణయాల నిరంతర అమలుకు ప్రత్యేక యంత్రాంగం వంటి అంశాలు ఆయన ప్రసంగంలో ప్రధానంగా నిలిచాయి. ఆహారం నుంచి ఇంధనం వరకు.. ఆరోగ్యం నుంచి విపత్తుల నిర్వహణ వరకు.. సరఫరా వ్యవస్థల పరిరక్షణ నుంచి ప్రపంచ పాలనా సంస్కరణల వరకు విస్తృత అజెండాతో సాగుతున్న ఈ సదస్సుపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. బ్రిక్స్ రెండో రోజు తీసుకునే నిర్ణయాలు, వెలువడే కార్యాచరణ ప్రపంచ రాజకీయ, ఆర్థిక సమీకరణాలకు ఎలాంటి కొత్త దిశను చూపుతాయన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# బ్రిక్స్‌లో 'న్యూఢిల్లీ' ఏకతాటిపై!

- సంయుక్త ప్రకటనకు సభ్య దేశాల ఏకగ్రీవ ఆమోదం
- యుద్ధం కాదు.. చర్చలు, దౌత్యమే మార్గమని స్పష్టీకరణ
- ఐరాస భద్రతా మండలిలో సంస్కరణలకు పిలుపు
- మానవాభివృద్ధికే అగ్రతాంబూలమన్న ప్రధాని మోదీ
- ప్రపంచ నేతలతో వరుస ద్వైపాక్షిక భేటీలు




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (చురకలు):** భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సభ్య దేశాల మధ్య భిన్నాభిప్రాయాలను అధిగమిస్తూ 'న్యూఢిల్లీ డిక్లరేషన్'కు ఏకాభిప్రాయం కుదిరింది. తొలుత సంయుక్త ప్రకటనపై సభ్య దేశాలు ఒక అవగాహనకు వచ్చినట్లు వార్తలు వెలువడగా.. అనంతరం కూటమిలోని దేశాలన్నీ దానికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. పశ్చిమాసియా సంక్షోభంతోపాటు అంతర్జాతీయ వివాదాలకు యుద్ధం పరిష్కారం కాదని, చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే శాంతిని సాధించాలని బ్రిక్స్ దేశాలు స్పష్టం చేశాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, ముఖ్యంగా పశ్చిమాసియా పరిణామాలపై సభ్య దేశాల మధ్య భిన్నమైన వైఖరులు ఉన్నప్పటికీ సంయుక్త ప్రకటనపై ఏకాభిప్రాయం సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఏ ఒక్క దేశాన్ని ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకోకుండా.. ఏకపక్ష యుద్ధ చర్యలను ఖండించే అంశాన్ని ప్రకటనలో పొందుపరిచినట్లు సమాచారం. ఇరాన్, యూఏఈ రెండూ బ్రిక్స్ సభ్య దేశాలే అయినప్పటికీ ప్రస్తుత గల్ఫ్ సంక్షోభంలో వాటి వైఖరులు భిన్నంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇరువర్గాలూ అంగీకరించే భాషను ప్రకటనలో పొందుపరచడం దౌత్యపరంగా సవాలుగా మారింది. ఇరాన్, యూఏఈతో భారత్‌కు సత్సంబంధాలు ఉండటంతో అధ్యక్ష దేశంగా విభేదాలను అధిగమించి ఏకాభిప్రాయం సాధించే దిశగా భారత్ చర్చలను ముందుకు నడిపినట్లు సమాచారం.

### యుద్ధం కాదు.. దౌత్యమే మార్గం

న్యూఢిల్లీ డిక్లరేషన్‌లో పశ్చిమాసియా సంక్షోభంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. అంతర్జాతీయ సమస్యలకు యుద్ధం పరిష్కారం కాదని సభ్య దేశాలు అభిప్రాయపడ్డాయి. నిరంతర చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే శాంతి సాధ్యమని పేర్కొన్నాయి. ఏకపక్ష యుద్ధ చర్యలను ఖండించడంతోపాటు మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని కోరాయి. ప్రపంచ సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడం, ఆహార-ఇంధన భద్రత, స్థానిక కరెన్సీల ద్వారా వాణిజ్యాన్ని పెంపొందించడం, డిజిటల్ సహకారాన్ని విస్తరించడం వంటి ఆర్థిక అంశాలపైనా ఏకాభిప్రాయం వ్యక్తమైంది. భారత్ అధ్యక్షతన 'మానవాభివృద్ధే ప్రథమం' అనే విధానంతో ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు.

### 'బ్రిక్స్ ఎవరికీ వ్యతిరేకం కాదు'

సదస్సును ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. బ్రిక్స్ కూటమి ఏ పాశ్చాత్య లేదా ఇతర వర్గానికి వ్యతిరేకంగా పనిచేసే వేదిక కాదని, అందరినీ కలుపుకొని ముందుకు సాగే భాగస్వామ్య వేదిక అని స్పష్టం చేశారు. బ్రిక్స్ ప్రయాణం రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో సభ్య దేశాల ప్రజలకు విశ్వాసం, భరోసా కల్పించాల్సిన బాధ్యత కూటమిపై ఉందన్నారు. అంతర్జాతీయ సమస్యలు, సవాళ్లకు బ్రిక్స్ దేశాలు కార్యాచరణ ద్వారా పరిష్కారాలు చూపాలని పిలుపునిచ్చారు. కూటమి వేగంగా అభివృద్ధి చెందడంతోపాటు వేసే ప్రతి అడుగులో మానవాభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యం ఉండాలని పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ దేశాల స్వరాన్ని మరింత బలోపేతం చేయాలని, ఐరాస భద్రతా మండలితోపాటు ఇతర అంతర్జాతీయ సంస్థల్లో సమగ్ర సంస్కరణలు అవసరమని పునరుద్ఘాటించారు. బ్రిక్స్‌లో తీసుకున్న నిర్ణయాలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేందుకు ప్రత్యేకంగా 'కంటిన్యూటీ అండ్ ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు చేయాలని మోదీ ప్రతిపాదించారు.

### 'అతిథి దేవో భవ'.. వెండి పాత్రల్లో భారతీయ రాజసం

సదస్సుకు హాజరైన విదేశీ అతిథులకు భారతీయ ఆతిథ్య సంప్రదాయాన్ని పరిచయం చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జైపూర్‌కు చెందిన అరుణ్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రత్యేక వెండి టేబుల్‌వేర్, కట్లరీని రూపొందించింది. ప్రాచీన భారత రాజుల విందులను గుర్తుచేసే సంప్రదాయ డిజైన్లతో వీటిని తీర్చిదిద్దారు. భారతీయ, చైనీస్, రష్యన్ తదితర వంటకాలను వడ్డించేందుకు అనువుగా 50 నుంచి 60 రకాల గిన్నెలు, ప్లేట్లు, స్పూన్లు, మూతలతో కూడిన కంటైనర్లను రూపొందించారు. ప్రతి వస్తువుకు మెరుగైన నాణ్యత, మెరుపు వచ్చేలా పది దశల్లో కోటింగ్, ఫినిషింగ్ ప్రక్రియ నిర్వహించారు. సంస్థ సీఈవో అరుణ్ పబువాల్ మాట్లాడుతూ.. 2023 జీ20 సదస్సుతోపాటు పలు ప్రముఖుల కార్యక్రమాలు, విదేశీ అధ్యక్షుల పర్యటనల్లోనూ తమ టేబుల్‌వేర్‌ను ఉపయోగించినట్లు తెలిపారు. ఎండీ అంతర పబువాల్ మాట్లాడుతూ.. నాణ్యత విషయంలో రాజీపడకుండా పూత, డిజైన్, ఫినిషింగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని, తయారీ నుంచి డిస్పాచ్ వరకు పది దశల్లో ఫినిషింగ్ ప్రక్రియ ఉంటుందని వివరించారు.

### మోదీతో ప్రపంచ నేతల వరుస భేటీలు



బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ పలువురు దేశాధినేతలు, ప్రభుత్వాధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. ఇథియోపియా ప్రధాని అబియ్ అహ్మద్‌తో ఆర్థిక సంబంధాలు, రక్షణ సహకారం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, ఆఫ్రికన్ యూనియన్ అభివృద్ధి, గ్లోబల్ సౌత్ ప్రయోజనాలపై చర్చించారు. మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో సెమీకండక్టర్ల తయారీ, కీలక ఖనిజాలు, స్వచ్ఛ ఇంధనం, మౌలిక సదుపాయాలు, వాణిజ్య విస్తరణపై చర్చించారు. అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్‌తో హైదరాబాద్ హౌస్‌లో జరిగిన భేటీలో భారత్-యూఏఈ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం, పెట్టుబడులు, స్వచ్ఛ ఇంధనం, వ్యాపార కారిడార్లు, ఆర్థిక సహకారంపై చర్చించారు. వియత్నాం ప్రధాని లే మిన్ హంగ్‌తో జరిగిన భేటీలో భారత్ 'యాక్ట్ ఈస్ట్' విధానంలో వియత్నాం కీలక భాగస్వామి అని మోదీ పేర్కొన్నారు. సముద్ర భద్రత, ఆర్థిక సహకారం, ఇండో-పసిఫిక్ ప్రాంత స్థిరత్వంపైనా చర్చించారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో పశ్చిమాసియా ఉద్రిక్తతలు, చాబహార్ పోర్టు ప్రాజెక్టు పురోగతి, అంతర్జాతీయ నౌకాయాన భద్రత, సముద్ర వాణిజ్య పరిరక్షణపై చర్చించారు.

### మోదీ-జిన్‌పింగ్ కీలక భేటీ

బ్రిక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య కీలక ద్వైపాక్షిక భేటీ జరిగింది. సరిహద్దు ఒప్పందాలు, వాణిజ్యం, పర్యాటకం, వ్యాపారం, సాంస్కృతిక సంబంధాలపై ఇరువురు నేతలు చర్చించారు. సరిహద్దు ఒప్పందాలను ఇరు దేశాలు తప్పనిసరిగా గౌరవించాలని మోదీ పేర్కొన్నారు. సరిహద్దుల్లో శాంతి, భద్రతలే ద్వైపాక్షిక సంబంధాలకు పునాది అని స్పష్టం చేశారు. సరిహద్దు వివాదాలకు న్యాయబద్ధమైన, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనేందుకు రెండు దేశాలు కట్టుబడి ఉండాలని, పరస్పర గౌరవం, సున్నితత్వం, ప్రయోజనాలు మార్గదర్శకంగా ఉండాలని మోదీ పేర్కొన్నారు. భారత్-చైనా మధ్య విభేదాలు వివాదాలుగా మారకూడదని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. రెండు దేశాల మధ్య భారీ వాణిజ్య లోటు, సరఫరా సమస్యలపైనా చర్చ జరిగింది. భారత ఉత్పత్తులకు చైనా మార్కెట్లలో సరైన ప్రవేశం కల్పించాలని మోదీ కోరారు. వ్యాపారం, పర్యాటకం, సాంస్కృతిక బదిలీలకు మరింత ఊతమివ్వాలని నిర్ణయించారు. బ్రిక్స్ సదస్సు విజయవంతానికి సహకరించినందుకు చైనాకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపారు. న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు ఏకగ్రీవ ఆమోదం లభించడం, పశ్చిమాసియా సంక్షోభంపైనా ఉమ్మడి వైఖరి వ్యక్తం కావడంతో ప్రపంచ శాంతి, ఆర్థిక సహకారం, మానవాభివృద్ధి దిశగా బ్రిక్స్ ఏకతాటిపై నిలిచినట్లయింది.

# జకీర్ నాయక్ భారత్‌కు అప్పగింతపై చర్చించాం

### మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ప్రకటన

### బ్రిక్స్ సదస్సు వేదికగా ప్రధాని మోదీతో ద్వైపాక్షిక భేటీలో జకీర్ ప్రస్తావన



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (చురకలు):** వివాదాస్పద మత ప్రచారకుడు జకీర్ నాయక్‌ను భారత్‌కు అప్పగించే అంశం మరోసారి తెరపైకి వచ్చింది. 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో జరిపిన చర్చల్లో జకీర్ నాయక్ అప్పగింత అంశం ప్రస్తావనకు వచ్చినట్లు మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం వెల్లడించారు. అయితే ఈ విషయంలో తమ దేశ చట్టాలకు లోబడే నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. బ్రిక్స్ సదస్సుకు హాజరైన అన్వర్ ఇబ్రహీం.. మోదీతో జరిపిన అంతర్గత చర్చల్లో జకీర్ నాయక్ అంశంపై మాట్లాడినట్లు తెలిపారు. జకీర్‌ను అప్పగించాలన్న భారత్ అభ్యర్థనను మలేషియా చట్టాలకు అనుగుణంగా జాగ్రత్తగా పరిశీలిస్తామని పేర్కొన్నారు. చట్టాన్ని గౌరవించడంతోపాటు భారత్--మలేషియా ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడం కూడా ముఖ్యమని చెప్పారు. ఇరు దేశాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ అంశంపై చర్చలను గోప్యంగా ఉంచాలని భావించినట్లు అన్వర్ తెలిపారు. రెండు దేశాల మధ్య పరస్పర నమ్మకం, అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడానికే తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. జకీర్ నాయక్‌పై భారత్‌లో విద్వేషపూరిత ప్రసంగాలు, మనీలాండరింగ్‌కు సంబంధించిన ఆరోపణలతో పలు కేసులు నమోదయ్యాయి. భారత దర్యాప్తు సంస్థలు అతడి కార్యకలాపాలు, నెట్‌వర్క్‌పై విచారణ చేపట్టిన నేపథ్యంలో 2016లో ఆయన మలేషియాకు వెళ్లారు. అప్పటి నుంచి అక్కడే నివసిస్తున్నారు. జకీర్ నాయక్‌ను విచారణ కోసం తమకు అప్పగించాలని భారత్ కొన్నేళ్లుగా మలేషియాను కోరుతోంది. అయితే అప్పగింతకు సంబంధించిన అభ్యర్థనను తమ దేశ చట్టాలు, సమర్పించిన ఆధారాల ప్రకారమే పరిశీలిస్తామని మలేషియా గతంలో పేర్కొంది. జకీర్ నాయక్‌పై రెడ్ నోటీసు జారీ చేయాలన్న అభ్యర్థనకు అవసరమైన ప్రమాణాలు నెరవేరలేదని ఇంటర్‌పోల్ గతంలో నిర్ణయించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ--అన్వర్ ఇబ్రహీం చర్చల్లో జకీర్ నాయక్ అప్పగింత అంశం మరోసారి ప్రస్తావనకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఈ చర్చలతో అప్పగింతపై తక్షణ నిర్ణయం వెలువడినట్లు కాకుండా.. మలేషియా చట్టపరమైన ప్రక్రియ ఆధారంగానే తదుపరి పరిణామాలు ఉండనున్నాయి.

# ఆరేళ్ల చిన్నారిపై ఘోరం.. మేనమామకు మరణశిక్ష

### అత్యాచారం, హత్య కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పు

### 17 నెలల్లోనే పూర్తయిన కేసు విచారణ

**ఛత్తీస్‌గఢ్, సెప్టెంబర్ 12 (చురకలు):** ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన కేసులో నిందితుడికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు మరణశిక్ష విధించింది. చిన్నారికి మేనమామ అయిన సోమేష్ యాదవ్‌ను దోషిగా తేల్చిన న్యాయస్థానం.. ఈ కేసును అత్యంత అరుదైనదిగా పరిగణిస్తూ ఉరిశిక్ష ఖరారు చేసింది. అదనపు సెషన్స్ జడ్జి అనిష్ దూబె ఈ మేరకు తీర్పు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లా ఓంనగర్ ఉర్లా ప్రాంతంలో గత ఏడాది ఏప్రిల్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. స్థానికంగా జరిగిన ఉత్సవం సందర్భంగా ఆరేళ్ల చిన్నారి తన అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. సాయంత్రం చీకటి పడినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో మోహన్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు, కుటుంబ సభ్యులు గాలిస్తుండగా సమీపంలోని ఓ కారు డిక్కీలో చిన్నారి మృతదేహం లభించింది. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చిన్నారిపై లైంగిక దాడి చేసి, అనంతరం హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. దర్యాప్తులో ఆధారాలను చెరిపివేసేందుకు నిందితుడు ప్రయత్నించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో చిన్నారి మేనమామ సోమేష్ యాదవ్‌పై అనుమానం వ్యక్తం చేసిన పోలీసులు.. విచారణ అనంతరం అతడే నేరానికి పాల్పడినట్లు తేల్చారు. పోలీసులను తప్పుదోవ పట్టించడంతోపాటు ఆధారాలు లభించకుండా చేసేందుకు నిందితుడు ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం సోమేష్ యాదవ్‌ను అరెస్టు చేసిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కేసు విచారణ కోసం దుర్గ్ జిల్లా కేంద్రంలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయగా.. 17 నెలల్లోనే విచారణ పూర్తయింది. నేర తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం దీనిని అత్యంత అరుదైన కేసుగా పేర్కొంటూ నిందితుడికి మరణశిక్ష విధించింది.



# కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై హర్షం



**మిరుదొడ్డి, సెప్టెంబర్ 12, :**
దుబ్బాక చేనేత వస్త్రాల ఎగుమతులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ తెలిపారు. చేనేత వస్త్రాల ఎగుమతుల కోసం ఆహర్నిశలు పాటుపడిన దుబ్బాక చేనేత సహకార సంఘం అధ్యక్షుడు అంకం మధును శనివారం మిరుదొడ్డిలో పద్మశాలి సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులు తయారుచేసిన దుబ్బాక చేనేత వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందన్నారు. అలాగే చేనేత కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు గడ్డం మధు, న్యాలపల్లి చంద్రమౌళి, కారంపూడి లచ్చయ్య, సుతారి వెంకటయ్య, ఆడెపు కుమార్, కొండ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరికి ఘన నివాళి



**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి సందర్భంగా శనివారం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గొడ్డుబర్ల భాస్కర్ మాట్లాడుతూ ఏచూరి లౌకిక, ప్రజా స్వామిక, భారత రాజ్యాంగ విలువలను కాపాడేందుకు మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని రక్షించాలని కార్మికులు, రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడన్నారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడిగా, మార్క్సిస్టు సిద్ధాంతవేత్తగా దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసుకున్నారని ప్రజా సమస్యలపై పదునైన వాదన, ప్రజా ఉద్యమాల పట్ల నిబద్ధత ఆయన రాజకీయ జీవితానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చాయనీ గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్ర బీజేపీ సర్కార్ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని బలహీన పరుస్తు ప్రశ్నించే వారిపై దాడులు దౌర్జన్యాలు అక్రమ నిర్బంధాలు విధిస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడం, లౌప్రజాస్వామ్య దేశ పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని అదే సీతారాం ఏచూరి మనం అర్పించే నిజమైన నివాళులు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం దుబ్బాక పట్టణ కార్యదర్శి కొంపల్లి భాస్కర్, నాయకులు ఎండీ సాజిద్, చెట్టి శ్రీనివాస్, యాదగిరి, మారుతి, కనకవ్వ తదితరులు పాల్గొన్నారు.

# నెల రోజులుగా డ్రైనేజీ సమస్య – వెంటనే పరిష్కరించాలి

- అధికారులకు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
జీడిమెట్ల మీనాక్షి కాలనీ, అంగడిపేట రోడ్డులోని వైన్ షాప్ సమీపంలో నెల రోజులుగా డ్రైనేజీ లీకేజీ సమస్య కొనసాగుతోంది. దీంతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తూ స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను శనివారం స్థానికులు తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన జీడిమెట్ల 132వ డివిజన్ (286, 287) బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి సంఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసి, డ్రైనేజీ లీకేజీని తక్షణమే మరమ్మతు చేయడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. నెల రోజులుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఈ సమస్యపై అధికారులు ఇకనైనా తక్షణమే స్పందించాలని నరేందర్ రెడ్డి కోరారు. మురుగు నీరు రోడ్డుపై ప్రవహించకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. "ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం. ప్రజల కోసం నిరంతరం అందుబాటులో ఉంటాం" అని నరేందర్ రెడ్డి తెలిపారు.

# అభివృద్ధిని అడ్డుకుంటున్న హరీశ్‌రావు రాజీనామా చేయాలి

- రైతుల ముసుగులో బీఆర్ఎస్ కార్యకర్తల ధర్నాలు సిగ్గుచేటు
- టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకుంటున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు వెంటనే రాజీనామా చేయాలని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి డిమాండ్ చేశారు. శనివారం నంగునూరు మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన ఎమ్మెల్యేగా నియోజక వర్గంలోని సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత హరీశ్‌రావుపై ఉందన్నారు. గతంలో ప్రారంభించి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయకుండా, ప్రతిరోజూ ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రతిపక్షం అంటే ప్రజా సమస్యలపై పోరాడటమే తప్ప, నిరాధార ఆరోపణలు చేయడం కాదని అన్నారు. రాష్ట్రంలో రైతులకు అవసరమైన విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తున్నప్పటికీ విద్యుత్ కోతలు విధిస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తూ, రైతుల ముసుగులో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ధర్నాలు చేయించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విద్యుత్ కోతలు ఒక్క సిద్దిపేట నియోజకవర్గంలోనే ఉన్నట్లు హరీశ్‌రావు ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వ్యక్తిగత రాజకీయ విమర్శలకు కాకుండా అభివృద్ధి,



ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేయలేని హరీశ్‌రావు తక్షణమే రాజీనామా చేయాలని యాదగిరి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అచ్చిన సత్తయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కాంగ్రెస్ మండల నాయకులు దాసరి కిషన్, కందికట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# కత్తిపోటుపై కాంగ్రెస్ "కొత్త" రాజకీయం

- కాంగ్రెస్ నేతల అసత్య ఆరోపణలపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
కాంగ్రెస్ నాయకుల అసత్య ఆరోపణలపై బీఆర్ఎస్ నాయకులు భగ్గుమన్నారు. మతిస్థిమితం కోల్పోయినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. దుబ్బాక నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు ఇల్లందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కొత్త



ప్రభాకర్ రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తూ రాక్షసానందం పొందుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో కొత్త ప్రభాకర్ రెడ్డిపై కత్తిపోటు జరిగి ప్రాణాపాయం నుంచి బయటపడితే, కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజల విశ్వాసం లేని కాంగ్రెస్ నాయకులకు ప్రజలే గుణపాఠం చెబుతారని, ఎమ్మెల్యేపై విమర్శలు చేయడాన్ని సహించబోమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి, ఆయన కార్యకర్తలు అసత్య ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు కొత్త ప్రభాకర్ రెడ్డిపై జరిగిన దాడిలో నిజా నిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు పలువురు పాల్గొన్నారు.

# సురక్షిత సిద్దిపేటే లక్ష్యం

- మహిళా భద్రత, సైబర్ అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలి
- సీపీ సాధన రష్మీ పెరుమాళ్

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ, సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ సూచించారు. శనివారం మహిళా పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులతో సిబ్బంది ఓర్పుగా, సానుభూతితో మాట్లాడాలని సూచించారు. వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని, అవసరమైన కౌన్సెలింగ్ అందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ముఖ్యంగా బాలికలకు మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల్లో వేధింపులు, చిత్రాల మార్ఫింగ్, ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 112 సహాయ నంబర్‌ను ఎలా వినియోగించుకోవాలో ప్రజలకు తెలియజేయాలని సూచించారు. మహిళా భద్రతకు సంబంధించిన చట్టాలపై కూడా అవగాహన కల్పించాలన్నారు. త్వరిత స్పందన బృందం ఆధ్వర్యంలో విద్యార్థినులు,



ఉద్యోగినులకు ప్రాథమిక ఆత్మరక్షణపై శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరిగేలా విధులు నిర్వహిస్తూ, అందరూ సమన్వయంతో పనిచేసి 'సురక్షిత సిద్దిపేట' సాధనకు కృషి చేయాలని సీపీ సాధన రష్మీ పెరుమాళ్ పిలుపు నిచ్చారు. సమావేశంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గా, భరోసా సిబ్బంది, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 'సీపీ కనెక్ట్'లో ప్రతిభ చూపిన 9 మంది పోలీసులకు అభినందనలు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ప్రోత్సహించేందుకు చేపట్టిన 'సీపీ కనెక్ట్' కార్యక్రమంలో భాగంగా తొమ్మిది మంది పోలీసు సిబ్బందిని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ అభినందించారు. కమిషనరేట్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు, ప్రత్యేక కిట్లను అందజేశారు. అనంతరం వారితో సీపీ మాట్లాడి విధి నిర్వహణ తీరును అభినందించారు. అభినందనలు పొందిన వారిలో హుస్నాబాద్ సీఐ శ్రీధర్, హోంగార్డు లింగస్వామి, కోహెడ హెడ్



కానిస్టేబుల్ సంపత్, కానిస్టేబుల్ జి వేణు, గౌరారం పోలీస్ కానిస్టేబుళ్లు ఎం విష్ణుచందర్, రవి, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ కానిస్టేబుళ్లు బి రాకేష్, బి కార్తీక్, ఎం సాహితీ ఉన్నారు. రాత్రి వేళల్లో అప్రమత్తంగా విధులు నిర్వహించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పాత నేరస్థులను పట్టుకోవడం, బందోబస్తులో సమర్థంగా పనిచేయడం, దొంగతనాలను అరికట్టడంలో సిబ్బంది చూపిన చొరవ అభినందనీయమని సీపీ పేర్కొన్నారు.ఇదే నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు 'సీపీ కనెక్ట్' కార్యక్రమం ద్వారా సమర్థవంతమైన పోలీసు బృందాన్ని తీర్చిదిద్దుతున్నామని సీపీ తెలిపారు.

# కొలన్ సులోచన మృతికి మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి సంతాపం

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మాతృమూర్తి, కీ.శే. కొలన్ సులోచన ఈ నెల 9న అకాల మృతి చెందడంతో శనివారం పలువురు ప్రముఖులు ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా చేవెళ్ల మాజీ ఎంపీ డా. గడ్డం రంజిత్ రెడ్డి కొలన్ హన్మంత్ రెడ్డిని పరామర్శించి, సులోచన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆమె మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సులోచన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొని సంతాపం తెలిపారు.



# జైరా కేఫ్ చాయ్ దునియా టీ స్టాల్ ను ప్రారంభించిన నరేందర్ రెడ్డి



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
జీడిమెట్ల 132వ డివిజన్ పరిధిలోని హెచ్‌ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో జైరా కేఫ్ చాయి దునియా ఓపెనింగ్ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలనీ అధ్యక్షులు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేఫ్ యజమానికి శుభాకాంక్షలు తెలిపిన నరేందర్ రెడ్డి, జైరా కేఫ్ వ్యాపారం మంచి ఆదరణ పొందుతూ విజయవంతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు పాల్గొని కేఫ్ యజమానికి శుభాకాంక్షలు తెలిపారు.

# వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

- పోలీసు నిబంధనలు తప్పక పాటించాలి
- సీపీ సాధన రష్మీ పెరుమాళ్




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12, :** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ సూచించారు. శనివారం గణేష్ మండపాల నిర్వాహకులు, వాలంటీర్లతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గణేష్ మండపాల వివరాలు, నిమజ్జనం తేదీ, శోభాయాత్ర మార్గం తదితర వివరాలను ముందుగానే తెలంగాణ పోలీస్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. దీనివల్ల పోలీసు బందోబస్తు, రాకపోకల నియంత్రణను సమర్థంగా చేపట్టేందుకు వీలుంటుందని తెలిపారు. ప్రతి మండపంలో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, విగ్రహాల ఊరేగింపు సమయంలో విద్యుత్ తీగలకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మండపాల వద్ద స్థానిక పోలీసు, విద్యుత్, మున్సిపల్, అగ్నిమాపక శాఖల అత్యవసర ఫోన్ నంబర్లను స్పష్టంగా ప్రదర్శించాలని తెలిపారు. మండపాల వద్ద, శోభాయాత్రలో డీజేలను ఉపయోగించరాదని స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లు, తప్పుడు వార్తలను నమ్మవద్దని, వాటిని ప్రచారం చేయవద్దని సూచించారు. ఇతరుల మత విశ్వాసాలను, మనోభావాలను దెబ్బతీసే పాటలు, నినాదాలు లేదా ఇతర కార్యక్రమాలను నిర్వహించరాదన్నారు. ఉత్సవాలు సజావుగా జరిగేందుకు మండపాల నిర్వాహకులు, వాలంటీర్లు పోలీసులతో సమన్వయంతో పనిచేయాలని సీపీ కోరారు. ప్రజలందరూ భక్తి, శాంతియుత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అదనపు డీసీపీలు కుశాల్కర్, ఏఆర్ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్, మల్లిఖార్జున్, ఎడీఈ సుధాకర్ రెడ్డి, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, గణేష్ మండపాల నిర్వాహకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**అశ్వారావుపేట ప్రతినిధి, సెప్టెంబర్ 12, :** అశ్వారావుపేట పట్టణంలో లయన్స్ క్లబ్ సభ్యులు కంచర్ల రమేష్ సహాయ సహకారంతో మట్టి వినాయకుల ఉచిత పంపిణీ శనివారం అశ్వారావుపేట లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్కినేని నరేంద్రబాబు ఆధ్వర్యంలో సుమారు 1000 మట్టి గణపతి వినాయకులను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిథిగా అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, ఎస్.ఐ యయాతి రాజు పాల్గొని భక్తులకు మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపి, మట్టి గణపతి యొక్క ఆవశ్యకతను తెలిపి పర్యావరణాన్ని కాపాడడంలో మట్టి గణపతుల ను ఉపయోగించడం వలన పర్యావరణ పరిరక్షణ కలుగుతుంది ప్రకృతి కాపాడిన వాళ్ళము అవుతామని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులను కొనియాడారు. అధ్యక్షులు లక్కినేని నరేంద్రబాబు మాట్లాడుతూ వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ కోసం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తుండటం ఎందుకంటే ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో కూడిన విగ్రహాల వల్ల జరిగే జల కాలుష్యాన్ని నివారించడమే ఈ సేవా కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ సీనియర్ సభ్యులు యూఎస్ ప్రకాష్, కోటగిరి మోహన్ రావు, బలమూరి సూర్యరావు, జూపల్లి రమణారావు, మేడవరపు శ్రీనివాసరావు, సమయమంతుల మహేశ్వర రావు, కంచర్ల భాస్కర్, కంచర్ల రమేష్, సుబ్బారావు, చీమకుర్తి వెంకటేశ్వరరావు, తాడేపల్లి రవి, దోబుగుంట్ల దుర్గారావు, సుబ్రహ్మణ్యం, శ్రీను, తిరుమల శెట్టి వెంకన్న, జలిపల్లి దేవరాజు, లక్కదాసు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# జ్యూట్ బ్యాగులతో పర్యావరణహిత వినాయక విగ్రహం

- త్రివేణి కిడ్స్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 12, :** త్రివేణి కిడ్స్ బీరంగూడలో వినాయక చవితి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించే ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుకల్లో డైరెక్టర్ వీరేంద్ర చౌదరి, సీఆర్ఓ సాయి నరసింహారావు, ప్రిన్సిపల్ భవాని, క్యాంపస్ ఇన్‌చార్జ్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జ్యూట్ బ్యాగులతో రూపొందించిన పర్యావరణహిత వినాయక విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ప్లాస్టిక్ వంటి పర్యావరణానికి హానికరమైన పదార్థాలకు బదులుగా సహజసిద్ధమైన జ్యూట్‌ను వినియోగించి చిన్నారులు వినూత్నంగా విగ్రహాన్ని రూపొందించారు. పండుగను ఆనందంగా జరుపుకోవడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించారు. విద్యార్థుల కోసం పాటలు, నృత్యాలు, సాంస్కృతిక, వినోదాత్మక కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. తల్లిదండ్రులు కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ చిన్న వయసు నుంచే విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ, బాధ్యతాయుతమైన జీవన విధానం, భారతీయ సంస్కృతిపై గౌరవాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పండుగలను ఆనందంగా జరుపుకోవడంతో పాటు ప్రకృతిని కాపాడే విధానాలను అలవర్చుకోవాలని సూచించారు.

# తెల్లాపూర్ రైల్వే అండర్ బ్రిడ్జికి రూ.21 కోట్లు మంజూరు

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎంపీ రఘునందన్‌రావు



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 12, :** తెల్లాపూర్ నుంచి విద్యుత్‌నగర్‌కు వెళ్లే మార్గంలోని రైల్వే అండర్ బ్రిడ్జి ఇరుకుగా ఉండటంతో గత 25 ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు త్వరలో పరిష్కారం లభించనుంది. సమస్యను గుర్తించిన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కేంద్ర రైల్వే శాఖ దృష్టికి తీసుకెళ్లడంతో అండర్ బ్రిడ్జి అభివృద్ధి పనులకు రూ.21 కోట్లు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో ఎంపీ రఘునందన్‌రావు రైల్వే, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బ్రిడ్జి ఇరువైపులా ఉన్న కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ, వీలైనంత త్వరగా అండర్ బ్రిడ్జి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణానికి సంబంధించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, సిఎంసి అధికారులు రైల్వే అధికారులు, డివిజన్ అధ్యక్షుడు రాంబాబు గౌడ్, సంషాబాద్ రాజు, ప్రవీణ్ కుమార్, రాజేందర్ రెడ్డి, కోటే రవికుమార్, నరసింహారెడ్డి, మాణిక్ రెడ్డి, సుభాన్ రెడ్డి, నరసింహ, సుధీర్, జోగు రవి, కుర్మ శంకర్, కృష్ణ, హృషీకేశ్, మంగలి శ్రీనివాస్, ప్రసాద్, ముకేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- రూ.4.06 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 12, :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి వార్డును అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు.పటాన్‌చెరు, జేపీ కాలనీ, ముత్తంగి డివిజన్ల పరిధిలో రూ.4.06 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.అనంతరం స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీ, దేవ్ ప్రైమ్ విలాస్ కాలనీలలో రక్షిత మంచినీటి సరఫరాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రతి కాలనీకి స్వచ్ఛమైన, రక్షిత తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటికి అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సపానదేవ్, శంకర్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, కుమార్ గౌడ్, ఈఈ సురేష్, డీఈ కృష్ణవేణి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, నర్రా బిక్షపతి, పృథ్వీరాజ్, వెంకటేష్, సందీప్, రామకృష్ణ, అంజాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

# జీడిమెట్లలో ఘనంగా 'జైరా కేఫ్ చాయ్ దునియా' టీ స్టాల్ ప్రారంభం



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 12, :** 132వ డివిజన్ జీడిమెట్ల పరిధిలోని హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో గంగాధర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'జైరా కేఫ్ చాయ్ దునియా' టీ స్టాల్ను శనివారం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంట సిద్దిరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తోకల నగేష్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి చింతనూరి రాజు, ఆలయ కమిటీ చైర్మన్ రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, వీరారెడ్డి నరేందర్ రెడ్డి, బచ్చ జ్ఞానేశ్వర్, పోగు సమ్మయ్య నేత, అప్పల శేఖర్, నదీమ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కమిటీ సభ్యులు దిడ్డి సురేష్, కుంట బాలయ్య, సుబ్బయ్య, బ్రహ్మయ్య, శివశంకర్, కట్టెల రమేష్, కుంట పోచయ్య, తిరుమలయ్యతో పాటు వివిధ కాలనీల సభ్యులు, నిర్వాహకులు, స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చింతల్ లో ఘనంగా గణేష్ ఆగమన్

## ముఖ్య అతిథిగా మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 12, :** మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, వారి మిత్రబృందం ఆధ్వర్యంలో శనివారం చింతల్‌లో నిర్వహించిన గణేష్ ఆగమన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఖాజా భాయ్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కావలి చంద్రయ్య, రంగారెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు జలీల్ ఖాన్, గణేష్ నగర్ డివిజన్ అధ్యక్షులు ఇరుగు రాధాకృష్ణ, దుండిగల్ డివిజన్ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, పద్మనగర్ డివిజన్ అధ్యక్షులు గడ్డం రాజేందర్ రెడ్డి, నిజాంపేట్ డివిజన్ అధ్యక్షులు కోటపాటి మురళి, బండారి లేఔట్ డివిజన్ అధ్యక్షులు వాసు వరగాని, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి గడ్డమీది భరత్ గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బొట్ల విజయ్ కుమార్, యువజన కాంగ్రెస్ నాయకులు మాదిరెడ్డి అరుణ్ రెడ్డి, బత్తుల చిరంజీవి తదితరులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజీనే రాజమార్గం




**గజ్వేల్ ప్రతినిధి, సెప్టెంబర్ 12, :** రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాలకు న్యాయం జరుగుతుందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ మూల స్వాతి గౌడ్ అన్నారు. గజ్వేల్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మన్వీర్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల 2,020 కేసులకు పరిష్కారం లభించిందని తెలిపారు. రాజీ ద్వారా వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడం వల్ల సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందుతాయని న్యాయమూర్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీపీ మాధవీలత, గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ సాగర్‌రావు, ఉపాధ్యక్షుడు నరేష్ చారి, తొగుట సీఐ లతీఫ్, గజ్వేల్ సీఐ రవికుమార్‌తో పాటు జగదేవ్‌పూర్, గజ్వేల్, దౌల్తాబాద్, రాయపోల్, గౌరారం, ములుగు, బేగంపేట పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

చురకలు ఆదివారం 13.09.2026

# పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతుల పంపిణీ

**గజ్వేల్ ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని 2వ వార్డు కౌన్సిలర్ గోలి మమత సంతోష్ పిలుపునిచ్చారు. ప్రకృతిని కాపాడుకుంటూ పండుగలు జరుపుకోవడమే నిజమైన భక్తి అని అన్నారు. శనివారం వార్డు పరిధిలో కౌన్సిలర్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషిత మవుతున్నాయని తెలిపారు.మట్టి గణపతులను పూజించడం ద్వారా సంప్రదాయాన్ని కొనసాగించడంతో పాటు పర్యావరణాన్ని కాపాడు కోవచ్చన్నారు. మట్టి విగ్రహాల నిమజ్జనం కూడా సులభంగా జరుగుతుందని వివరించారు. వార్డును పర్యావరణహిత వార్డుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ప్రముఖులు, మహిళలు, యువకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



# తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని చాటిచెప్పాలి

- సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలి: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించి జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం షాపూర్‌నగర్ భవన నిర్మాణ కార్మికుల అడ్డా నుంచి ఐడీపీఎల్ చౌరస్తా వరకు నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ర్యాలీకి ముందు కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సభలో జాన్ వెస్లీ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పి. సత్యం మాట్లాడారు. నైజాం పాలనలో పాలకుర్తి ప్రాంతంలో భూస్వామి విస్నూరి రామచంద్రారెడ్డి సాగించిన అక్రమాలను వీరనారి చిట్యాల ఐలమ్మ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ధైర్యంగా ప్రతిఘటించారని వారు గుర్తుచేశారు. ఆ స్ఫూర్తితోనే తెలంగాణ వ్యాప్తంగా భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం చారిత్రాత్మక తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగిందని తెలిపారు. శ్రామిక, పీడిత వర్గాల విముక్తి కోసం జరిగిన ఈ పోరాటం చరిత్రలో గొప్ప ఉద్యమంగా నిలిచిందన్నారు. ఆ పోరాటంలో భాగంగా సుమారు 3 వేల గ్రామాల్లో గ్రామ రాజ్యాలు ఏర్పడి వెట్టిచాకిరీని రద్దు చేసి, నిరుపేదలకు సుమారు 10 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసినట్లు తెలిపారు. నైజాం రజాకార్లు, దొరలు, భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో వేలాది మంది అమరులయ్యారని, మరెందరో దాడులు, చిత్రహింసలను ఎదుర్కొని పోరాటాన్ని కొనసాగించారని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులను



స్మరించుకోవడం అంటే పీడిత వర్గాల విముక్తి పోరాట చరిత్రను గుర్తుచేసుకోవడమేనని అన్నారు. సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు, మోటార్‌సైకిల్ యాత్రలు, బహిరంగ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సాయుధ పోరాట స్ఫూర్తిని చాటిచెప్పే కార్యక్రమాలను ప్రజలు, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటరామయ్య, సంతోష్, నరేష్, లింగస్వామి, పార్టీ సీనియర్ నాయకులు సుదర్శన్, వెంకన్న, టీవీఎస్ రమణ, పార్టీ నాయకులు అంజయ్య, సత్యం, కరుణాకర్, జాకీర్, శీను, స్వాతి, విజయ, జాన్సీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న ఆలయ రహదారి అభివృద్ధికి శ్రీకారం



- రూ.6 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మాజీ కార్పొరేటర్ జగన్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దుమ్ నగర్ పోలాలబస్తీలో వెలసిన శ్రీ మల్లన్న స్వామి ఆలయానికి వెళ్లే రహదారి సీసీ రోడ్డు పనులకు శనివారం మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొలుకుల జగన్ మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తులు, స్థానిక ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో దాదాపు రూ.6 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకులు కొలుకుల జైహింద్, బీజేపీ నాయకులు పున్నారెడ్డి, స్థానిక నాయకులు దేపే కృష్ణ, భాస్కర్ రెడ్డి, రాములు, రాజు, భాస్కర్, ప్రేమ్ చందర్ రెడ్డి, వేణుగోపాల్, దేవేందర్, అర్జున్, డీజే సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి హితమే పండుగల పరమార్థం

- మట్టి గణపతులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 12, :**
పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి (జీఎంఆర్) పిలుపునిచ్చారు. ప్రకృతి హితమే పండుగల అసలు పరమార్థమని పేర్కొన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని గాంధీ థీమ్ పార్క్ సర్కిల్‌లో బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు స్వయంగా ప్రతిమలను అందజేశారు.ఈ సందర్భంగా జీఎంఆర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో ప్రకృతి ఆరాధనకు ప్రత్యేక స్థానం



ఉందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ)తో తయారు చేసిన వినాయక ప్రతిమల వల్ల జలవనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా బల్దియా ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది సుమారు 600 మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణహితంగా నిర్వహించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.కార్యక్రమంలో పటాన్‌చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఈఈ సురేష్, డీఈ కృష్ణవేణి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, నర్రా బిక్షపతి, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.6 లక్షల సొంత నిధులతో దేవాలయ షెడ్ నిర్మాణం

- షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే జీఎంఆర్

**అమీన్పూర్, సెప్టెంబర్ 12, :**
బీరంగూడ డివిజన్ పరిధిలోని మండే మార్కెట్ శ్రీశ్రీశ్రీ లక్ష్మీ గణపతి దేవాలయ అభివృద్ధికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తన వంతు సహకారం అందించారు. ఆలయ ఆవరణలో రూ.6 లక్షల సొంత నిధులతో నిర్మించిన షెడ్డును శనివారం ఉదయం ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధితో పాటు భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా షెడ్డును నిర్మించినట్లు పేర్కొన్నారు.ఆలయ అభివృద్ధిలో భాగంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆలయాన్ని దశలవారీగా అభివృద్ధి చేసి మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. గతంలోనూ ఆలయ సాలహారం నిర్మాణానికి రూ.2 లక్షల నిధులు అందించినట్లు గుర్తు చేశారు.కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు బాలరాజు, గోపాల్,



ప్రమోద్‌రెడ్డి, కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వాల్టా చట్టానికి తూట్లు

- అనుమతులు లేకుండా చెట్ల నరికివేత
- అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 12, :**
పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వాలు ప్రచారం చేయడం తప్ప, క్షేత్రస్థాయిలో మాత్రం పట్టించుకోవడం లేదని లింగుపల్లి గ్రామ ఉపసర్పంచ్ బాలకిషన్, వార్డు సభ్యులు పవన్, కిషన్ ఆరోపించారు. మండలంలోని లింగుపల్లి గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా కలప వ్యాపారాలు నిర్వహిస్తూ, రహదారికి ఇరువైపులా ఉన్న పెద్ద చెట్లను నరికివేసి తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని వారు తెలిపారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ చెట్ల నరికివేత జరుగుతున్న విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఆరోపించారు. సెలవు రోజు కావడంతో ఈ విషయంలో తనకు సంబంధం లేదని కార్యదర్శి చెప్పినట్లు వారు పేర్కొన్నారు. ఇదే విషయాన్ని మండల పరిషత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లను పరిరక్షించాల్సిన అధికారులే అక్రమంగా చెట్లను నరికివేస్తున్న వారికి వత్తాసు పలకడం సరికాదన్నారు. గ్రామంలో అనుమతులు లేకుండా కలపను తరలిస్తున్న వారిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెట్ల నరికివేతను అడ్డుకుని పర్యావరణ పరిరక్షణకు కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయమై అటవీ శాఖ సెక్షన్ అధికారి మల్లేశంను ఫోన్ ద్వారా సంప్రదించగా ఆయన స్పందించలేదు. దీంతో ఈ వ్యవహారంపై అటవీ శాఖ అధికారుల వివరణ తెలియరాలేదు.



# 13 ఏళ్ల ఎడబాటుకు తెర.. లోక్ అదాలత్‌తో భార్యాభర్తల రాజీ..

**గజ్వేల్ ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
పదమూడేళ్లుగా వేర్వేరుగా జీవిస్తున్న భార్యాభర్తలు లోక్ అదాలత్ ద్వారా రాజీ పడి కుటుంబ సమస్యను పరిష్కరించుకున్నారు. దీంతో ఇన్నాళ్లుగా కొనసాగుతున్న కేసుకు ముగింపు పలికింది. అహ్మదీపూర్ గ్రామానికి చెందిన అండె లక్ష్మి కి తొగుట మండలం లింగంపేట గ్రామానికి చెందిన అండె ఆంజనేయులుతో వివాహం జరిగింది. వివాహ సమయంలో లక్ష్మి తల్లిదండ్రులు నగదు, బంగారం, వెండి ఆభరణాలతో పాటు గృహోపకరణాలను కట్నంగా ఇచ్చారు. కొంతకాలం వారి సంసారం సజావుగానే సాగింది. వారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. తర్వాత అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్తమామలు, ఇతర కుటుంబ సభ్యులు తనను



వేధించారని లక్ష్మి ఆరోపించింది. ఈ విషయంపై గ్రామ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపింది. చివరకు తనను ఇంటి నుంచి పంపించడంతో 2013 మే 14న గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి భార్యాభర్తలు వేర్వేరుగా జీవిస్తున్నారు. ఈ కేసు లోక్ అదాలత్ పరిధిలోకి రావడంతో ఇరువర్గాలతో చర్చలు నిర్వహించారు. పెద్దల సమక్షంలో జరిగిన చర్చల అనంతరం భార్యాభర్తలు తమ మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించుకుని రాజీకి వచ్చారు. దీంతో 13 ఏళ్లుగా కొనసాగిన ఎడబాటుకు తెరపడింది. ఈ కార్యక్రమంలో గజ్వేల్ న్యాయస్థాన ప్రథమ శ్రేణి న్యాయాధికారి స్వాతి గౌడ్, ఏపీపీ మాధవీలత, గజ్వేల్ పోలీసు వలయ అధికారి రవికుమార్, న్యాయవాది అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కుటుంబ వివాదం సామరస్యపూర్వకంగా పరిష్కారం కావడంతో ఇరువర్గాల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

# గుత్తుల మీరా కుమార్‌కు ఘన సన్మానం

- కష్టాల్లో ఉన్న జాతి బిడ్డలకు అండగా నిలుస్తా: గుత్తుల మీరా కుమార్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 12, :** తెలంగాణ రాష్ట్ర శెట్టి బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు, జీఎంకే చారిటబుల్ ట్రస్ట్ అధినేత, రంగారెడ్డి నగర్ శెట్టి బలిజ సంక్షేమ సంఘం చీఫ్ అడ్వైజర్ గుత్తుల మీరా కుమార్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని రంగారెడ్డి నగర్ శెట్టి బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం కమిటీ సభ్యులు, సంఘ పెద్దలు, శెట్టి బలిజ సంఘం ప్రతినిధులు పాల్గొని గుత్తుల మీరా కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గుత్తుల మీరా కుమార్ మాట్లాడుతూ, తన జన్మదినం సందర్భంగా రంగారెడ్డి నగర్ శెట్టి బలిజ సంక్షేమ సంఘం సభ్యులు తనను ఆహ్వానించి ఘనంగా సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తన ప్రతి కార్యక్రమానికి అండగా నిలుస్తూ, ముందుకు నడిపిస్తూ ఆశీస్సులు అందిస్తున్న సంఘ సభ్యులు, పెద్దలకు తన కుటుంబం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి, కష్టాల్లో ఉన్న జాతి బిడ్డలకు అండగా నిలిచి, తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే పలుచోట్ల వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు తన వంతు



సేవలందిస్తున్నామని తెలిపారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. "జాతి బిడ్డలకు ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉండి, నా వంతు సేవలందిస్తా" అని గుత్తుల మీరా కుమార్ స్పష్టం చేశారు.

# శభాష్ నందారం.. ప్రజాసేవలో ఆదర్శం

- **రూ.25 లక్షల సొంత నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం**
- **రాఘవేంద్ర కాలనీలో ఆంజనేయస్వామి ఆలయ రోడ్డు పనులకు శంకుస్థాపన**



**అమీన్‌పూర్, సెప్టెంబర్ 12, :**
ప్రజా సమస్యల పరిష్కారానికి సొంత నిధులు వెచ్చిస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతున్న అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహగౌడ్‌ను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అభినందించారు. ప్రజాసేవే ధ్యేయంగా పనిచేస్తూ సమాజహితం కోసం సొంత నిధులు వెచ్చించే నాయకులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు.సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని బీరంగూడ డివిజన్ రాఘవేంద్ర కాలనీలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లే మార్గంలో 300 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి నందారం నరసింహగౌడ్ తన సొంత నిధుల నుంచి రూ.25 లక్షలు కేటాయించారు. ఈ పనులకు శనివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నందారం నరసింహగౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజా సమస్య పరిష్కారానికి సొంతంగా రూ.25 లక్షలు వెచ్చించి రోడ్డు నిర్మించడం అభినందనీయమన్నారు. నందారం నరసింహగౌడ్ ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమం, ప్రాంత అభివృద్ధికి ముందుంటారని కొనియాడారు. రోడ్ల నిర్మాణంతో పాటు వినాయక మండపాల షెడ్ల నిర్మాణం, ప్రజాహిత, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సైతం తనవంతు సహకారం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు.రాఘవేంద్ర కాలనీ అధ్యక్షుడు మల్లేష్‌తో పాటు కాలనీవాసులు మాట్లాడుతూ ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండటంతో భక్తులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని నందారం నరసింహగౌడ్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి రూ.25 లక్షల సొంత నిధులతో రోడ్డు నిర్మాణానికి ముందుకు వచ్చారని తెలిపారు. రోడ్డు పనులు ప్రారంభించినందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు బాలరాజు, గోపాల్, ప్రమోద్‌రెడ్డి, కృష్ణ, యూనుస్, రమేష్‌గౌడ్, స్థానిక నాయకులు, కాలనీ కమిటీ ప్రతినిధులు, మహిళలు, యువకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# లెనిన్ నగర్‌లో రూ.54 లక్షల సీసీ రోడ్లకు శంకుస్థాపన

- **ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యం: కూన శ్రీశైలం గౌడ్**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
రోడామేస్త్రి నగర్ డివిజన్ పరిధిలోని లెనిన్ నగర్‌లో రూ.54 లక్షల వ్యయంతో మంజూరైన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ప్రజల మౌలిక అవసరాలను పట్టించుకోకపోవడంతో నియోజకవర్గ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజల మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నియోజకవర్గవ్యాప్తంగా సుమారు రూ.50 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని అన్నారు. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలతో ప్రజలకు మేలు జరుగుతోందని పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి నిధుల విడుదలకు సహకరించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుకు కూన శ్రీశైలం గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్, స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి, రషీద్ బేగ్, డివిజన్ అధ్యక్షులు మధుసూదన్, రాజిరెడ్డి, రవీందర్ రెడ్డి, రామ్ నర్సయ్య, సలీం, సాయిలు, రజాక్, నాగరాజు, రవిచారి, ఆదినారాయణ, ఉప్పల రవి, వెంకట్ రాజు తదితరులు పాల్గొన్నారు.



# బెజ్జంకి, కోహెడలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు





**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
బెజ్జంకి, కోహెడ మండలాల్లో జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి శనివారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ సంస్థలు, నిర్మాణ పనులను పరిశీలించారు.

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ**

బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. హాజరు, రోగుల వివరాల నమోదును తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా అని ఆరా తీశారు. ఆసుపత్రి 24 గంటలు అందుబాటులో ఉండేలా చూసి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధుల కేసుల వివరాలను ఏఎన్ఎంలు, పర్యవేక్షకులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి వారం నిర్వహించే పారిశుద్ధ్య కార్యక్రమాల్లో సిబ్బంది పాల్గొని, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బాలికల వసతి గృహంలో తనిఖీ బెజ్జంకి మండలంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నిర్ణయించిన ఆహార పట్టికను తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్, ఇతర రికార్డులను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల హాజరుకు అనుగుణంగానే వివరాలను నమోదు చేయాలని సూచించారు. రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

**ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనుల పరిశీలన**

కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామ శివారులో సుమారు 23 ఎకరాల్లో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న సమీకృత గురుకుల పాఠశాల సముదాయ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ ప్రాంతమంతా కలియతిరిగి పనుల పురోగతిని పరిశీలించారు. అత్యాధునిక సాంకేతిక విధానంలో, ఇటుకలు ఉపయోగించకుండా మై–వన్ సాంకేతికతతో నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. భారీ విద్యాసంస్థ కావడంతో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కొండల మధ్య, పచ్చని చెట్ల నడుమ నిర్మిస్తున్న ఈ సమీకృత పాఠశాల సముదాయం రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచేలా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# కొలన్ సులోచన మృతికి డా. ఎస్. మల్లారెడ్డి సంతాపం



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మాతృమూర్తి కొలన్ సులోచన (సులోచనమ్మ) ఈ నెల 9న అకాల మరణం చెందారు. ఆమె మృతితో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, కాంగ్రెస్ శ్రేణుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం పలువురు ప్రముఖులు కొలన్ హన్మంత్ రెడ్డి నివాసానికి చేరుకుని ఆయనను పరామర్శించారు. మాజీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. ఎస్. మల్లారెడ్డి కొలన్ హన్మంత్ రెడ్డిని పరామర్శించి, సులోచనమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా. ఎస్. మల్లారెడ్డి మాట్లాడుతూ సులోచనమ్మ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. సులోచనమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని సులోచనమ్మకు నివాళులర్పించారు.

# కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ దోహదం

- **సమయం, వనరులు ఆదా అవుతాయి**
- **జిల్లా జడ్జి సుదర్శన్**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
సమయం, వనరులు వృథా కాకుండా రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ చైర్మన్ సుదర్శన్ సూచించారు. శనివారం సిద్దిపేట జిల్లా కోర్టులో జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ సివిల్, క్రిమినల్ కేసుల్లో రాజీకి అవకాశం ఉన్న వాటిని ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో పరిష్కరించు కోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించు కోవడంతో సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరువర్గాల మధ్య సత్సంబంధాలు కొనసాగుతాయని తెలిపారు. లోక్ అదాలత్ సందర్భంగా దివ్యాంగుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. దివ్యాంగుల పింఛన్లు, సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. గ్రామీణ అభివృద్ధి శాఖ, ఆర్‌సెటి ఆధ్వర్యంలో శిక్షణ, ఉపాధి అవకాశాలపై వివరించారు. దివ్యాంగులకు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేకంగా ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ మేళాకు 175 మంది హాజరుకాగా, వివిధ సంస్థలు నిర్వహించిన ఇంటర్వ్యూల ద్వారా 30 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. లీడ్ బ్యాంకు ద్వారా రుణాలు పొందే అవకాశాలపై కూడా



అవగాహన కల్పించారు. అనంతరం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామీణ అభివృద్ధి, సంక్షేమ, ఉపాధి కల్పన శాఖలు, లీడ్ బ్యాంకు స్టాళ్లను జిల్లా జడ్జి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి జయప్రసాద్, జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల దేవస్థానం అన్న ప్రసాద వితరణ పథకానికి భక్తుల విరాళం

**శ్రీశైలం ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ కు చెందిన ఏ వేణుమాధవ్ శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణ పథకానికి రూ.1,00,000 ను శనివారం విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ పర్యవేక్షకులు కె శివప్రసాద్ కు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దాతకు విరాళానికి తగిన రశీదు, తీర్థ, ప్రసాదాలు అందజేశారు.




# మట్టి గణపతి.. మహా గణపతి..

- **పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక ప్రతిమల పంపిణీ**
- **39వ వార్డులో ఇంటింటికీ మట్టి గణపతుల పంపిణీ**
- **తాజా మాజీ కౌన్సిలర్ దీప్తినాగరాజు**



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
మట్టి వినాయక ప్రతిమలను పూజించడం ద్వారా సంప్రదాయాన్ని గౌరవించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించినట్లవుతుందని సిద్దిపేట మున్సిపాలిటీ 39వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ దీప్తినాగరాజు అన్నారు.వినాయక చవితిని పురస్కరించుకుని శనివారం 39వ వార్డులో ఇంటింటికీ మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ప్రత్యేక పెట్టెల్లో మట్టి వినాయక ప్రతిమతో పాటు పూజా విధానానికి సంబంధించిన పుస్తకాన్ని ఉంచి ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా దీప్తినాగరాజు మాట్లాడుతూ పంచభూతాల్లో ఒకటైన మట్టితో తయారు చేసిన వినాయకుడిని పూజించడం ప్రకృతిని గౌరవించడమేనన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి సంవత్సరం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది హైదరాబాద్ నుంచి వెయ్యి మట్టి వినాయక ప్రతిమలను తీసుకొచ్చి 39వ వార్డులో ఇంటింటికీ పంపిణీ చేసినట్లు చెప్పారు. సనాతన ధర్మ సంప్రదాయం ప్రకారం వినాయకుడు మట్టితోనే రూపొందించబడ్డాడని, అందుకే మట్టి వినాయకుడిని పూజించడంలో ప్రత్యేకత ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. ప్రజలందరికీ ముందస్తుగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

చురకలు



# శ్రీశైల దేవస్థానంలో సాంస్కృతిక కార్యక్రమాలు




**శ్రీశైలం ప్రతినిధి, సెప్టెంబర్ 12, :**
శ్రీశైల దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా నిత్యకళారాధన కార్యక్రమంలో వీఎస్ఎన్ మూర్తి, ద్విభాష్యం, వారి బృందం, హైదరాబాద్ భక్తి రంజని కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద శనివారం సాయంకాలం నుండి ఈ భక్తిరంజని కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమములో గణపతి ప్రార్థన, నమోభూతనాథ, నమో నమో శివ, శంభోమహాదేవ, సాంబసదాశివ తదితర పలు కీర్తనలను అక్షర, అనంత్, ప్రజ్ఞ, కాంతిమణి తదితరులు ఆలపించారు. ఈ కార్యక్రమానికి తబల సహకారాన్ని టిఆర్ శ్రీనివాస్ అందించనున్నారు. రెండవ కార్యక్రమములో భాగంగా శ్రీమహానందీశ్వర భజన మండలి, మహానంది మండలం, నంద్యాల జిల్లా వారిచే భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామి అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని, ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి.

# గణేష్ ఆగమన వేడుకల్లో పాల్గొన్న అడువాల జ్యోతి లక్ష్మణ్



**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 12,:**
జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ల బావి సమీపంలోని గణేష్ నగర్‌లో లక్ష్మీ బాయ్స్ ఆధ్వర్యంలో గణేష్ ఆగమన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ, విఘ్నాలను తొలగించి ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని శ్రీ గణేశుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దుమల రాజు కుమార్, అల్లాల సరిత రమేష్, అయూబ్, మాజీ కౌన్సిలర్ పంబల రాము, జగిత్యాల టౌన్ సీఐ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై గణనాథుడికి భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికారు.

# రాజీవ్ రహదారిపై రైతుల ధర్నా



**గజ్వేల్ ప్రతినిధి (కొండపాక), సెప్టెంబర్ 12, :**
వర్షాకాలంలో సాగు చేసిన వరి పంటలకు నిరంతరంగా 12 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ దుద్దెడ సబ్‌స్టేషన్ పరిధిలోని రైతులు శనివారం సబ్‌స్టేషన్ ఎదుట రాజీవ్ రహదారిపై ధర్నా నిర్వహించారు. అంకిరెడ్డిపల్లి, బంధారం, దర్గా, దుద్దెడ, రాంపల్లి, మర్పడగ తదితర గ్రామాలకు చెందిన రైతులు ఆందోళనలో పాల్గొన్నారు. గతంలో వరి పంటలకు 14 గంటలపాటు విద్యుత్ సరఫరా చేయగా, ప్రస్తుతం 10 గంటలకు కుదించడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పంటల సాగు కోసం పెట్టుబడులు పెట్టి అప్పుల ఊబిలో ఉన్నామని, విద్యుత్ సరఫరా తగ్గితే పంటలు దెబ్బతిని మరింత నష్టపోయే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. హుస్నాబాద్ డివిజన్‌లోని ఇతర గ్రామాలకు 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారని, తమ ప్రాంతానికి కూడా 12 గంటలపాటు నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. రైతుల ధర్నాకు రైతుబంధు సమితి మాజీ కోఆర్డినేటర్ ర్యాగల దుర్గయ్య, బిఆర్ఎస్ కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు నీల సత్యం మద్దతు తెలిపారు. రైతుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి 12 గంటల విద్యుత్ సరఫరా అందించేలా కృషి చేస్తానని దుద్దెడ ఏఈ సత్యం హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. అనంతరం ఏఈ సత్యంకు రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దుద్దెడ సర్పంచ్ మిద్దె శివకుమార్, అంకిరెడ్డి పల్లె సర్పంచ్ గాలి బాలయ్య, నాయకులు గోనే శ్రీనివాస్, నీల వెంకటేశం, కిషన్ రావు, మిద్దె చంద్రమౌళి, తేలు అశోక్, పిడిశెట్టి శ్రీనివాస్, రాసుల రంజిత్, బాలాజీ, నీల వెంకటేష్, ఎలుక రాజిరెడ్డి గజ్వేల్ కర్ణాకర్ రెడ్డి, గంగుల వెంకటేష్, బట్ట వెంకటేష్, మిద్దె చెద్రమౌళి, మిట్టపల్లి రాజు, నీల హరీష్, గగిల్లాపురం సాయి బాబు దుద్దెడ నరేష్ గౌడ్, పల్లె యాదగిరి, జక్కుల శ్రీశైలం, ఎర్రబోయిన కనకయ్య, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆచరణాత్మక అభ్యాసానికి గీతం పెద్దపీట

- **అధునాతన మైక్రోకంట్రోలర్లు, మెషిన్ లెర్నింగ్ పై రెండు రోజుల కార్యశాల**

**పటాన్చెరు, సెప్టెంబర్ 12, :**
అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల డిమాండ్లను తీర్చడానికి ఇంజనీరింగ్ విద్యార్థులను సిద్ధం చేయడంలో ఆచరణాత్మక, పరిశ్రమ–ఆధారిత అభ్యాసం యొక్క ప్రాముఖ్యతకు హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా, స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ కు చెందిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈఈసీఈ) విభాగం అధునాతన మైక్రోకంట్రోలర్లపై మెషిన్ లెర్నింగ్ అనే అంశంపై రెండు రోజుల వృత్తి నైపుణ్యాభివృద్ధి ఆచరణాత్మక కార్యశాలను విజయవంతంగా నిర్వహించింది. ఎస్ఏఎన్ఎస్ఐ ఆర్ ఎఫ్, కమ్యూనికేషన్ సిస్టమ్స్ సహకారంతో దీనిని ఏర్పాటు చేశారు.ఈ కార్యశాలలో 80 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇది వారికి అభివృద్ధి చెందుతున్న టైనీ మెషిన్ లెర్నింగ్ రంగంలో లీనమయ్యే, ఆచరణాత్మక అభ్యాస అనుభవాన్ని అందించింది. అనుభవపూర్వక అభ్యాసానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రూపొందించిన ఈ కార్యక్రమంలో మెషిన్ లెర్నింగ్ ప్రాథమిక అంశాలు, టైని ఎంఎల్, సెన్సార్ ఇంటర్ ఫేసింగ్, డేటా సేకరణ, డేటాసెట్ సృష్టి, మోడల్ శిక్షణ, మైక్రోకంట్రోలర్లపై మోడల్ అమలు, రియల్–టైమ్ ఇన్ఫరెన్స్, హార్డ్ వేర్ ఇంటిగ్రేషన్ వంటి కీలక భావనలను వివరించారు.ఆచరణాత్మక శిక్షణలో భాగంగా, ఇందులో పాల్గొన్నవారు ఐదు ప్రాక్టికల్ ప్రాజెక్టులను విజయవంతంగా అభివృద్ధి చేసి, అమలు చేశారు. తద్వారా మైక్రోకంట్రోలర్ ప్లాట్ ఫారమ్ లపై మెషిన్–లెర్నింగ్ ఆధారిత అప్లికేషన్లను రూపొందించి, అమలు చేయడంలో విలువైన అనుభవాన్ని పొందారు.



ప్రాజెక్టు–ఆధారిత విధానం, సెన్సార్ డేటా సేకరణ, డేటా సెట్ తయారీ నుంచి మోడల్ శిక్షణ, అమలు, హార్డ్ వేర్ అనుసంధానం, రియల్–టైమ్ ఇన్ఫరెన్స్ వరకు గల పూర్తి మెషిన్ లెర్నింగ్ వర్క్ ఫ్లోను విద్యార్థులు అర్థం చేసుకోవడానికి వీలు కల్పించింది.ఈ కార్యశాల, సైద్ధాంతిక భావనలను వాస్తవ ప్రపంచ అనువర్తనాలతో అనుసంధానించడానికి, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎంబెడెడ్ సిస్టమ్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ), ఎడ్జ్ కంప్యూటింగ్ రంగాలకు సంబంధించిన ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి విద్యార్థులకు ఒక అవకాశాన్ని అందించింది.స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ప్రశాంత ఆర్. ముడిమేల ఈ చొరవను ప్రశంసించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, కార్యక్రమ నిర్వాహకుడు ఎం.నరేష్ కుమార్, సహ నిర్వాహకుడు డాక్టర్ ఎస్.కె. జానీ భాషా ఈ కార్యశాలను సమన్వయం చేశారు.

# 18 మంది చిన్నారులకు గుండెకు పునర్జన్మ

- **లండన్ వైద్యుడు రమణారావు దన్నపునేని సేవలకు ఎమ్మెల్యే సంజయ్ ప్రశంసలు**
- **నిమ్స్‌లో ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు**
- **చిన్నారుల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటుకు సీఎం సానుకూలత**
- **చిన్నారులకు గుండె శస్త్ర చికిత్స అమలుకు చర్యలు తీసుకోవాలి**
- **ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డికి సూచించిన సీఎం**

**హైదరాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 12,:**
గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న నిరుపేద చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహిస్తూ వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న జగిత్యాల జిల్లాకు చెందిన ప్రముఖ వైద్యుడు రమణారావు దన్నపునేని సేవలను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అభినందించారు. లండన్‌లో వైద్య వృత్తిని కొనసాగిస్తున్న రమణారావు తన వైద్య బృందంతో కలిసి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో తాజాగా 18 మంది చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సలహాదారు, మాజీ ఆరోగ్యశాఖ మంత్రి సుదర్శన్ రెడ్డితో కలిసి లండన్ నుంచి వచ్చిన వైద్య బృందంతో సమావేశమై చిన్నారుల వైద్య సేవలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. జగిత్యాల జిల్లాకు చెందిన రమణారావు దన్నపునేని గత ఏడేళ్లుగా 'లిటిల్ హార్ట్ ఫౌండేషన్' ద్వారా గుండె వ్యాధులతో బాధపడుతున్న




చిన్నారులకు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. లండన్ నుంచి పదిమంది వైద్య నిపుణులు, సిస్టర్లతో కూడిన బృందాన్ని హైదరాబాద్‌కు తీసుకువచ్చి నిమ్స్ ఆస్పత్రుల్లో కిమ్స్ ఆసుపత్రులలో ఇప్పటివరకు సుమారు 200 మంది చిన్నారులకు గుండెకు సంబంధించిన పరీక్షలు చేసి 18 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు వివరించారు.ఈ విడతలో గత ఆరు రోజులుగా నిమ్స్‌లో సుమారు 200 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, వారిలో అవసరమైన 18 మందిని గుర్తించి గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. అందులో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన ఇద్దరికి చేశారని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చిన్నారులకు గుండె శస్త్రచికిత్స చేయించాలంటే సుమారు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇంతటి భారీ వ్యయాన్ని భరించలేని నిరుపేద కుటుంబాలకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించడం ఎంతో గొప్ప సేవ అని అన్నారు. చిన్నారుల ప్రాణాలను కాపాడటంతో పాటు వారి కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు నిమ్స్‌లో ఇటువంటి గుండె శస్త్రచికిత్సలు మరింత విస్తృతంగా జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. శనివారం నిమ్స్ చీఫ్ కార్డియోథొరాసిక్ సర్జన్ అమరేశ్వరరావు, రమణారావు దన్నపునేని, ముఖ్యమంత్రి సలహాదారు సుదర్శన్ రెడ్డితో సుమారు గంటన్నర పాటు సమావేశమై చిన్నారుల గుండె వైద్యానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు. సమావేశంలో చర్చించిన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. చిన్నారుల గుండె వ్యాధులకు సంబంధించి నిమ్స్‌లో, టిమ్స్ ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వివరించారు. తాజాగా శస్త్రచికిత్సలు చేయించుకున్న 18 మంది చిన్నారుల్లో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన ఇద్దరు దళిత చిన్నారులు కూడా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. వారి గుండె ఆపరేషన్ల కోసం ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున 3 కోట్ల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు. రమణారావు దన్నపునేని తన సొంత ఖర్చులతో లండన్, అమెరికా తదితర దేశాల నుంచి వైద్య నిపుణుల బృందాన్ని హైదరాబాద్‌కు తీసుకువచ్చి నిరుపేద చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. డబ్బు లేక వైద్యం అందక చిన్నారుల ప్రాణాలు ప్రమాదంలో పడకుండా, వారికి మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో రమణారావు చేస్తున్న సేవలు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు.నిరుపేద చిన్నారులకు గుండెకు సంబంధించిన అత్యాధునిక వైద్యం అందించేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి సలహాదారు సుదర్శన్ రెడ్డి, నిమ్స్ వైద్య బృందం, రమణారావు దన్నపునేని, ఆయన వైద్య బృందానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# అర్హులైన దళితులకు దళిత బంధు ఇవ్వాలి

- **టిఆర్ఎస్ జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్**

**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12,:**
అర్హులైన దళిత కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామని చెప్పిన దళిత బంధు క్రింద ఆర్థిక సహాయం చెయ్యాలని హుజురాబాద్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన జిల్లా నాయకులు బండ అశోక్ ఆధ్వర్యంలో శనివారం నిరాహార దీక్ష చేపట్టారు. దీక్ష శిబిరాన్ని తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ సందర్శించి మాట్లాడుతూ దళిత బంధు పథకం రెండో విడత నిధులు ఎప్పుడు చేస్తారో చెప్పాలని హుజురాబాద్ నియోజకవర్గంలో మిగిలిన వారిని గురించి అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు ఇవ్వాలని, మొదటి విడతలో లబ్ది పొందని వారికి ఇవ్వాలని. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం దళిత బంధు పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తుందో సమాధానం చెప్పాలని వారు అన్నారు. దళిత కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తామని చెప్పి ఓట్లు వెయించుకున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లోకి వచ్చాక ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందని వారు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు చెప్పిన విధంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి 12 లక్షల ఆర్థిక సహాయం అందించాలని నిరసన దీక్ష చేస్తున్న హుజూరాబాద్ నియోజకవర్గం నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమం హుజూరాబాద్



నియోజకవర్గ నాయకులు బుర్ర నటరాజ్, సురేష్, సంతోష్ యాదవ్, దీటి శిరీష రమేష్, జిల్లా నాయకులు యండి సల్మా, జంగ అపర్ణ, దసరి అంజలి, గౌతమి, రంగరవేణి లక్ష్మణ్, శ్రీరాముల రమేష్, కుతాడి శ్రీనివాస్, బసవేణి రాజేందర్, అంబాల హరిష్ తదితరులు ఉన్నారు.

# వృత్తుల్లో కెల్లా ఉపాధ్యాయ వృత్తి విశిష్టమైనది

- **విద్యతో పాటు మానవత్వ విలువలను పెంపొందించాలి**

## లయన్ అమర్నాథ్ రావు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12, :** అన్ని వృత్తులలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో విశిష్టతను కలిగి ఉన్నదని, ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి సమ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కౌన్సిల్ చైర్ పర్సన్ లయన్ అమర్నాథ్ రావు కోరారు. శుక్రవారం రాత్రి సిద్దిపేటలోని లైన్స్ భవన్ లో లయన్స్ క్లబ్ సిద్దిపేట ఆధ్వర్యంలో జిల్లాలోని 22 మంది జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన



మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన చేబట్టి విద్యార్థులను సన్మార్గంలో పయనింప చేయాలన్నారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి మానవతా విలువలు, ఇతరులకు సహాయం చేయడం, పెద్దలను గౌరవించే గుణాలను చదువుతోపాటు నేర్పించాలన్నారు. సెల్ఫోన్లను అవసరాలకు అనుగుణంగా వినియోగించేల తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చదువు ఆవశ్యకతను వివరిస్తూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాఫల్యం చేసుకునేలా వ్యూహాత్మక బోధనలు చేపట్టి ఆదర్శంగా నిలవాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లైన్ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ గంప రమేష్ క్లబ్ అధ్యక్షులు నర్సింలు, కార్యదర్శి శ్రీధర్, ఆర్థిక కార్యదర్శి శ్రీనివాస్ లతోపాటు, ప్రతినిధులు జోజి, నల్ల నాగరాజం, జ్యోతి, రామ్ రెడ్డి, రాముని భాస్కర్, భాస్కర్ రెడ్డి, సురేష్ కుమార్, నరసింహారెడ్డి, రవిలతో పాటు సన్మాన సన్మాన గ్రహీతలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# పురాణ పురుషులు మల్లాది చంద్ర శేఖరులు

## నేడు అభినవ వ్యాస మల్లాది చంద్రశేఖర శాస్త్రి జయంతి

ఆయన పురాణ ప్రవచనం గావిస్తుంటే పండిత పామరులు మంత్రముగ్ధులయి తీరాల్సిందే. ధర్మసందేహాలు కార్యక్రమంలో శ్రోతల సందేహాలకు సమాధానాలు చెబుతుంటే కార్యక్రమంలో లీనం కావాల్సిందే. భద్రాచాల సీతారాముల కల్యాణానికిగాని, తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గాని, శ్రీశైలంలో భ్రమరాంబా మల్లికార్జునుల కల్యాణానికి గానీ వ్యాఖ్యానం చేస్తుంటే శ్రోతలు తమ చెవులు అప్పగించాల్సిందే. ఆయన గళం నుంచి వెలువడే ప్రతిమాటా సప్రామాణికం, సవ్యాఖ్యాన సహితం...ఆయనే అభినవ వేదవ్యాస మహర్షిగా లబ్ద ప్రతిష్టులైన పౌరాణిక సార్వభౌమ మల్లాది చంద్ర శేఖర శాస్త్రి. మల్లాది ప్రముఖ పండితులు, పురాణ ప్రవచకులు. ఆయన స్వరంలోని మాధుర్యం, రామాయణ, భారత, భాగవతాలపై ఆయనకున్న పట్టు కారణంగా పురాణ ప్రవచన ప్రముఖులలో ఆయన ప్రత్యేకతను సంతరించు కున్నారు. తన పదిహేనవ ఏట నుంచి ప్రారంభించిన ఈ ప్రవచన యజ్ఞం అసిధారావ్రతంగా కొనసాగుతునే ఉంది. సహస్ర చంద్ర దర్శనం చేసుకున్నా, శత జయంతి వేడుకల సమయాన్ని సమీపిస్తున్నా, జీరవోని గొంతుతో, ఉపన్యాసం, హరికథ, నాటకం, పురాణం కలిపి శ్రోతలను ఆకట్టుకునే విధంగా చేస్తున్న ప్రవచనాలు ఆయన అసమాన ప్రతిభకు నిదర్శనాలు. మల్లాది దక్షిణామూర్తి దంపతులకు 1925 ఆగస్టు 22న భాద్రపద శుక్ల తృతీయ నాడు అర్ధరాత్రి, అంటే తెల్లవారితే వినాయక చవితి అనగా సనాతన సత్సంప్రదాయం గల కుటుంబంలో ఆయన జన్మించారు. తాతగారు మల్లాది రామకృష్ణ విద్వత్ చయనుల వద్ద పెరిగిన క్రమంలో, నాయనమ్మ కృష్ణవేణి సోమిదమ్మ సాకగా, తాతగారే ఉపనయన సంస్కారం చేశారు. ఆయన వద్దనే తర్క ప్రకరణాలు, శ్రౌతస్మార్తాలు అభ్యసించారు. ఆయన పితృదేవులు దక్షిణామూర్తి శాస్త్రి పుష్పగిరి ఆస్థాన పండితులు. ఆర్షసంప్రదాయాన్ని ఆయన వద్దనే అలవరచు కున్నారు. పెత్తండ్రి వీరరాఘవ శాస్త్రి తర్కవేదాంత పండితులు. పినతండ్రి హరిశంకర శాస్త్రి తెనాలిలో వేదవిద్యా పరీక్షాధికారిగా పని చేసేవారు. పినతండ్రి వద్దే వేదాధ్యయనం గావించి, కంభంపాటి రామ్మూర్తి శాస్త్రి వద్ద పూర్వ మీమాంస, వ్యాకరణం నేర్చుకున్నారు. తెలుగు మాత్రం వీధిబడిలో చదువు కున్నారు. తాతగారికి, మనమడు పురాణ ప్రవచనం చెప్పాలని కోరిక. ఆంగ్ల విద్య అభ్యసిస్తే, ఉద్యోగం చేస్తానంటారని ఎలాంటి పరీక్షలు రాయ నివ్వకుండా తాత జాగ్రత్త పడ్డారు. అయితే శాస్త్రికి పురాణాలు చెప్పడం ఇష్టం ఉండేది కాదు. అది గ్రహించిన తాతగారు "చూడు నాయనా, పురాణ ప్రవచనం చెప్పాలంటే సంస్కృత వాఙ్మయం తెలిసి ఉండాలి. నిశిత పరిశీలన కావాలి. అన్వయం చెప్పగలిగి ఉండాలి. వేదాంతం, తర్కం, ఛందస్సు తెలిసుండాలి. కాబట్టి దీన్ని అంత తేలికగా తీసేయకు" అని చెప్పేవారు. పదిహేడవ యేట తాత కాలం చేశారు. ఆయన దూరమైనా ఆయన సంకల్పం మాత్రం ఎప్పుడూ చంద్రశేఖర శాస్త్రిని అంటిపెట్టుకునే ఉంది. కొంత కాలం తరువాత బెజవాడ వెళ్లి వేదాంత శాస్త్రం చదవాలనే కోరికతో అమరావతి నుంచి గుంటూరు వెళ్ళారు. బస్టాండు కొచ్చాక పరిచయస్థులు కొందరు కనిపించి "పుష్పగిరి పీఠాధిపతులు ఇప్పుడు నరసరావు పేటలో ఉన్నారు. త్వరలో ఆయన మకాం మార్చేస్తారట. ఈలోగా నువ్వొకసారి వెళ్లి ఆయన దర్శనం చేసుకోవచ్చు" అని సలహా ఇచ్చారు. దాంతో వెంటనే నరసరావు పేటకు వెళ్ళి,స్వాములవారి దర్శనం చేసుకోగానే పీఠాధిపతులు 'నువ్వు అమరావతిలో పురాణ ప్రవచనం చక్కగా చెప్పావని తెలిసింది. నాకు కూడా వినాలని ఉంది, ఇవ్వాళ ఇక్కడ పురాణం చెప్పు" అన్నారు. ఆ మాటలను ఆదేశంగా తీసుకుని ఆయన ముందు వాల్మీకి రామాయణం చెప్పారు. స్వామివారు చాలా సంతోషించి, నెలకు 40 రూపాయల గ్రాసం మీద పుష్పగిరి ఆస్థానంలో పురాణ పండితునిగా నియమించారు. ఆయనతో పాటే ఊరూరూ తిరుగుతూ ఏడాదిన్నర పాటు చంద్ర శేఖర శాస్త్రి పురాణ ప్రవచనం చెప్పారు. తర్వాత పెత్తండ్రి మల్లాది వీరరాఘవశాస్త్రి బెజవాడలో బ్రహ్మ సత్రయాగం జరుపుతుంటే ఆయన కోరిక మేరకు అక్కడ సుమారు సంవత్సరం పాటు ప్రవచనం చేశారు. ఆయన ఇరవై అయిదవ ఏట సీతారామ ప్రసన్నతో వివాహం జరిగింది. సరిగ్గా ఏడాది తర్వాత అంటే 1951లో ఆయనకు కొడుకు పుట్టాక తాతపై గల గౌరవంతో, జ్ఞాపకార్థం రామకృష్ణ అని పేరుపెట్టు కున్నారు. దివంగత ప్రధాని పాముల పర్తి నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, వంటి రాజకీయ ప్రముఖులతో పాటు చిత్తూరు వి.నాగయ్య, ఘంటసాల, ఎస్వీరంగారావు, కన్నాంబ వంటి వెండితెర నటీ నటులు ఆయన ప్రవచనాలను ఎంతో ఇష్టపడేవారు. ఒక సందర్భంలో చిత్తూరు నాగయ్య ఇంటికి పిలిచి భోజన వస్త్రాలతో సత్కరించి, చేతికి స్వర్ణకంకణం తొడగడం శాస్త్రి మరచి పోలేని జ్ఞాపకం. చాలామంది సినిమాలలో నటించమని అడిగితే ఇష్టం లేక తిరస్కరించారు. ఆయన ప్రవచనం చెబుతుండగా శ్రోతలు వింటున్నట్లుగా ఉండే దృశ్యాన్ని చిత్రీకరించాలని కొందరు దర్శకులు ప్రయత్నాలు చేసినా, ఎందుకనో అది కూడా వీలు పడక పోవడం యాదృచ్ఛికం.వందలాది రామాయణ, మహాభారత, భాగవత ప్రవచనాలూ నిర్వహించడమే కాకుండా, ప్రతియేటా ఉగాది నాడు పంచాంగ శ్రవణం చేసేవారు. దూరదర్శన్‌లో, సప్తగిరి చానల్‌లో ప్రవచనాలు కొనసాగించే ప్రయత్నం చేశారు. వయసు మీద పడుతుండడంతో, శారీరిక శక్తి సన్నగిల్లి, ప్రయాణాలు చేయ లేకుండా ఉన్న కారణంగా 2011 జనవరి నుంచి పురాణ ప్రవచనాలు చెప్పడం క్రమంగా తగ్గించారు. శ్రీవేంకటేశ్వర భక్తిచానల్, సప్తగిరి చానల్ వారు తమ చానల్‌లో ప్రవచనం చెప్పవలసిందే అని పట్టుబట్టడంతో తమ ఇలవేల్పు పట్ల ఉన్న భక్తి, గౌరవం మేరకు వారిని కాదనలేక పోయారు. శోకరసమైతే దుఖంలో దుఃఖ సాగరంలో, హర్ష దాయకమైతే ఆనందంతో మమేకమై పరవశించి పోయే ఆయన ప్రవచనంలో లీనమయ్యే తీరు దశాబ్దాల ప్రవచన కాలంలో శ్రోతల, ప్రేక్షక జన బాహుళ్యానికి సన్నిహితంగా ఉంచింది. మల్లాది చంద్రశేఖరశాస్త్రి సుదీర్ఘ పురాణ ప్రవచన ప్రస్థానంలో ఎందరో ప్రముఖులు, ప్రముఖ సంస్థలతో లెక్కలేనన్ని సన్మానాలు, సత్కారాలు, బిరుదులు పొందారు. అందులో ప్రముఖంగా తిరుమల తిరుపతి దేవస్థానాలలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో స్వామి వారి కల్యాణ వ్యాఖ్యాతగా అభినవ వ్యాస బిరుదును పొందారు. శృంగేరి పీఠాధిపతి చంద్రశేఖర స్వామి ఆశీర్వచనంతో సవ్యసాచి బిరుదును, భీముని పట్నం సద్గురు శివానందమూర్తి నెలకొల్పిన సనాతన ధర్మట్రస్ట్ ద్వారా ఎమినెంట్ సిటిజన్ అవార్డును అందుకోవడమే కాక మాజీ ప్రధాని పి.వి నరసింహారావుతో సత్కారం అందుకున్నారు. 2005లో ప్రతిష్ఠాత్మక రాజా-లక్ష్మీ అవార్డు ద్వారా వచ్చిన లక్ష రూపాయల నగదును సనాతన ధర్మట్రస్టుకు విరాళమిచ్చారు. పురాణ ప్రవచన సాంప్రదాయం కొనసాగాలనే తపనతో, ఎందరో శిష్యులను తమ ఆశయానికి అనుగుణంగా తీర్చిదిద్దిన పరమ భాగవతోత్తములు చంద్రశేఖర శాస్త్రి.. 96 ఏళ్ళ వయసులో 14, 2022న వయోభారంతో పాంచభౌతిక కాయాన్ని వదిలి శివైక్యం చెందారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# నైజాం విముఖత.. 'పోలో'తో విలీనం



- నేడు హైదరాబాద్‌పై సైనిక చర్య ప్రారంభమైన రోజు
- భారత యూనియన్‌లో చేరేందుకు నిరాకరించిన ఏడో నిజాం
- రజాకార్ల ఆగడాలతో అట్టుడికిన హైదరాబాద్ సంస్థానం
- 1948 సెప్టెంబర్ 13న మొదలైన 'ఆపరేషన్ పోలో'
- సెప్టెంబర్ 17న భారత యూనియన్‌లో హైదరాబాద్ విలీనం

**దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి దేశవ్యాప్తంగా 565 సంస్థానాలు ఉండేవి. బ్రిటీష్ పాలకులు స్వాతంత్ర్యం ఇస్తూనే... సంస్థానాలు ఇండియాలో కలవాలో లేదో నిర్ణయించుకునే అవకాశం సదరు పాలకులకే ఇచ్చారు. ఫలితంగా... మూడు సంస్థానాలు ఇండియాలో కలవలేదు. అవి కాశ్మీర్, జునాఘడ్, హైదరాబాద్ (నైజాం). ఆ పరిస్థితుల్లో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్... ప్రత్యేక శ్రద్ధ పెట్టి... జునాఘడ్ సంస్థానాన్ని భారత్‌లో కలిసేలా చేశారు. నైజాం నవాబ్ మాత్రం విలీనానికి ఒప్పుకోలేదు. అప్పట్లో రాజాకార్ల పేరుతో ప్రత్యేక సైన్యాన్ని తయారుచేసిన ఖాసిం రజ్వీ... మారణ కాండకు తెగబడ్డారు. స్వాతంత్ర్యం వచ్చాక దాదాపు 13 నెలలపాటూ... తెలంగాణ ప్రజలు చూడని నరకం లేదు. కనీసం తినడానికి తిండి, తాగడానికి నీళ్లు కూడా లేకుండా చేశారు.**





పొట్ట కూటికోసం వర్తక వ్యాపారాలకై వచ్చిన శ్వేత జాతీయులు , రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంలో సమస్త భారతావనిని అంతర్భాగం చేసుకోగా, ఎన్నో సుదీర్ఘ పోరా టాలు, ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సాధించినా, నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణ ప్రాంతం స్వతంత్రం కావడానికి సంవత్సరంకు పైగా సమయం పట్టింది. 1724-1948 మధ్యకాలం 224 సంవత్సరాల పాటు 8 తెలంగాణ జిల్లాలు, 5 మరట్వాడా జిల్లాలు, 3 కర్ణాటక జిల్లాలతో కలిపి 16 జిల్లాల హైదరాబాద్ రాష్ట్రం మూడు భాషలతో కొనసాగింది. హైదరాబాద్ సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ పరిపాలనా చివరి అంకంలో ఖాసిం రజ్వీ నేతృత్వంలో రజాకార్ల దళాల దురాగతాలు సహించరాని వైనాయి. ఉద్యమ కారులను గురి చేసిన క్రూరాతిక్రూర అమానుష చిత్రహింసలకు హద్దులు లేకుండా పోయాయి. 90 రకాల పన్నుల విధింపే కాకుండా తమ పలుకు బడిలోని ప్రజలను బానిసలుగా చూస్తూ , వెట్టి చాకిరీలు చేయించు కున్నారు . ప్రజల సొమ్ముతో జల్సాలు చేసు కున్నారు. ఎదిరిస్తే కాల్చి చంపారు. మత మార్పిడులు బలవంతంగా చేశారు. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయలను అణచి వేశారు. స్థానీయ భాషలను, అనాదిగా ఉన్న సంప్రదాయాలను హీనంగా చూశారంటే తెలుగు వారి దుర్గతి స్పష్టమవుతుంది. స్వామి రామానంద తీర్థ నాయకత్వంలో ఆర్యసమాజ్, కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాయుధ పోరాటాలు, కవులు, రచయితలు తమతమ పాత్రలు నిర్వహించి, నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజా చైతన్యానికి కృషి సల్పారు. నల్గొండలో పురుడు పోసుకున్న నిజాం వ్యతిరేక పోరాటం రాజ్యం అంతటా విస్తరించింది. రావి నారాయణ రెడ్డి, చంద్ర రాజేశ్వరరావు , మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలా దేవి, బొమ్మగాని ధర్మభిక్షం, మాడపాటి హన్మంతరావు , సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ నారాయణరావు, దాశరథి, షోయబుల్లా ఖాన్, అనభేరి ప్రభాకర్ రావు, జమలాపురం కేశవరావు, లక్ష్మీనర్సయ్య, బద్ధం ఎల్లారెడ్డి, మగ్ధూం మొహియుద్దీన్, దొడ్డి కొమురయ్య, కోదాడ నారాయణరావు , బెల్లం నాగయ్య, సింగిరెడ్డి భూపతిరెడ్డి, రాంజీగోండు, కొమురం భీం, రఘునాధరావు కాచే , అలుగు వీరమ్మ, కిషన్ మోదాని, లక్క కిష్టయ్య, బత్తిని మొగిలయ్య, కాటం లక్ష్మీ నారాయణ, మర్రి చెన్నారెడ్డి, వందేమాతరం రాంచందర్ రావు , కర్నె వెంకట కేశవులు ఒక్కరేమిటి... వివిధ పోరాట మార్గాలలో, ఎందరో త్యాగధనులు తమతమ పాత్రలను పోషించి, ప్రాణాలను ఫణంగా పెట్టారు. నారాయణరావు పవార్, శంశా బాద్ గంగారామ్ తో కలిసి ఏకంగా నిజాం పైనే బాంబులు విసిరి సంచలనం సృష్టించారు. దాశరథి కారాగారంలో గోడలపై నిజాం వ్యతిరేక కవితలు రాశారు. కాళోజి, సుద్దాల హనుమంతు, యాదగిరి లక్ష్మీనారాయణ లాంటి వారు జన బాహుళ్య కవితలల్లారు. ఇలా నిజాం వ్యతిరేక పోరాటాలు వివిధ రూపాల్లో ఉద్ధృతం అయిన వేళ . . .రజాకార్ల ఆగడాలు, భారత ప్రభుత్వానికి, నిజాంకు మధ్య జరిగిన అన్ని చర్చలూ విఫలమయ్యాయి. భారత దేశంలో విలీనానికి నిజాం అంగీకరించలేదు. రజాకార్ల ఆగడాలు మితిమీరి పోయాయి. మరోవైపు కమ్యూనిస్టుల సాయుధ పోరాటం సాగుతోంది. హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగా నైనా , లేక పాకిస్తాన్లో అంతర్భాగంగా నైనా ఉండాలని నిజాం ప్రయత్నిస్తూ, ఐక్య రాజ్య సమితికి నిజాం, భారతదేశంపై ఫిర్యాదు చేయడానికి దూతలను సైతం పంపాడు. పోరాటానికి దేశాల నుండి ఆయుధ సంపత్తిని పొందే కృషి సల్పారు.

1946 - 1948ల మధ్య హైదరాబాదు రాజ్యంలో నెలకొన్న పరిస్థితులు అత్యంత ఉద్రిక్తమైనవి. హైదరాబాదుకు స్వతంత్ర ప్రతిపత్తి కావాలని ఆశిస్తూ, దాన్ని ప్రత్యేక దేశంగా గుర్తించాలని నిజాం ప్రతిపాదించాడు. ఇత్తెహాదుల్ ముస్లిమీన్ సైనిక విభాగమైన రజాకార్ల కు చెందిన ఖాసిం రజ్వీ రంగంలోకి దిగడం దానివల్లనే జరిగింది.

యథాతథ స్థితికి ఒప్పందం...

వాస్తవ పరిస్థితిని నిజాం రాజుకు అర్థమయ్యేలా చెప్పడానికి కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించి, 1947 నవంబర్ 29న యథాతథ స్థితి ఒప్పందం కుదిరింది. 1947 ఆగస్టు 15కు పూర్వపు పరిస్థితికి ఒక సంవత్సరం పాటు కట్టుబడి ఉండాలనేది ఈ ఒప్పంద సారాంశం. నవాబు స్వయంగా ఢిల్లీకి వెళ్లి సర్దార్ పటేల్‌ను కలిసి, 1947 నవంబర్ 29వ యథాతథ ఒప్పందంపై మౌంట్‌బాటన్ నిజాం నవాబు సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా హైదరాబాదులో భారత్ తరపున ఏజంట్ జనరల్‌గా కె.ఎం.మున్షీ నియమితుడయ్యాడు.

అయినా నైజాం, ఆయన నియమిత సైన్యం ఆగడాలు ఆగలేదు. ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది. ఆదివాసీలు ఏకమై ఎదురు తిరిగారు. ఎంతో మంది ఉద్యమ నేతలు, కళాకారులు... అందరూ తమ ప్రాణాలు ఫణంగా పెట్టారు. ఉద్యమం అత్యంత తీవ్ర స్థితికి చేరిన స్థితిలో, కేంద్ర ప్రభుత్వం నిజాం సంస్థాన్ని ఇండియాలో కలిపేయమని సర్దార్ వల్లభాయ్ పటేల్‌కి సూచించగా, ఈ క్రమంలోనే "ఆపరేషన్ పోలో," పేరుతో నాటి భారత హోం మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ పటేల్ నేతృత్వంలో " పోలీసు చర్య" చేపట్టడం జరిగింది. జనరల్ జె. ఎన్. చౌదరి నాయకత్వంలో 1948 సెప్టెంబర్ 13 న సైనిక చర్య ప్రారంభమైంది. భారత సైన్యం విడివడి విజయవాడ, బీదర్ వైపుల నుండి నలు వైపులా ముట్టడికి ముందుకు సాగాయి. ఓటమిని తప్పించుకో లేని నిజాం, దిక్కు తోచక, లేక్ వ్యూ అతిథి గృహంలో ఉన్న భారత ఏజెంట్ మున్షీని కలిసి, లొంగు బాటు నిర్ణయాన్ని ప్రకటించాడు. బొల్లారం వద్ద నిజాం, సర్దార్ పటేల్ ముందు తలవంచి, లొంగి పోవడంతో, సైనిక చర్య సెప్టెంబర్ 17 న సఫలీకృతమైంది. తద్వారా హైదరాబాద్ రాజ్యం, భారత యూనియన్లో విలీనమైంది. నిజాం ప్రధాన మంత్రి లాయక్ అలీని తొలగించి, ఖాన్ రజ్వీని ఖైదు చేశారు. తర్వాత లాయక్, రజ్వీ పాకిస్తాన్ పారి పోయారు. శాసన సభ రద్దు చేయబడి సెప్టెంబర్ 18న సైనిక చర్యను సఫలం చేసిన జే. ఎన్. చౌదరి, సైనిక గవర్నర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు . ఎం. కె. వెల్లోడి ముఖ్యమంత్రి గా, నియుక్తు లైనారు. 1956 ఏప్రిల్ 1న నిజాంకు , భారత ప్రభుత్వానికి ఒప్పందం కుదిరి, నిజాంకు ఏడాదికి పన్నులు లేకుండా, యాభై లక్షల రూపాయల భరణం చెల్లింపు కు, ప్రపంచంలో నిజాం ఎక్కడికి వెళ్ళినా హైదరాబాద్ పూర్వపు రాజుగా బిరుదులు కొనసాగింప బడేందుకు, ప్రభుత్వం అంగీకరించింది. అలా 1956 అక్టోబర్ 31 వరకు నిజాం రాజ్ ప్రముఖ్ గా కొనసాగారు.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



చురకలు





# హైదరాబాద్ రంజీ జట్టు కెప్టెన్‌గా సిరాజ్

రంజీ ట్రోఫీ కొత్త సీజన్‌కు హైదరాబాద్ జట్టు కొత్త ఉత్సాహంతో సిద్ధమవుతోంది. భారత స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు జట్టు పగ్గాలు అప్పగించింది హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ). 2026-27 సీజన్‌లో హైదరాబాద్‌కు సిరాజ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. చామా మిలింద్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. అక్టోబర్ 11 నుంచి రంజీ ట్రోఫీ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో త్రిపురతో హైదరాబాద్ తలపడనుంది. హైదరాబాద్ ఎలైట్ గ్రూప్-బిలో ఉంది. సౌరాష్ట్ర, కర్ణాటక, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అసోం, త్రిపుర ఈ గ్రూపులో ఉన్నాయి. ఇటీవల శ్రీలంక పర్యటనలో సిరాజ్ ఆశించిన స్థాయిలో వేగం చూపలేకపోయాడు. సాధారణంగా గంటకు 140 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు వేసే అతడు.. అక్కడ 120 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేశాడు. రెండు మ్యాచ్‌ల్లో 44 ఓవర్లు వేసి నాలుగు వికెట్లు తీసుకున్నాడు. రెండు నెలల విరామం తర్వాత నేరుగా మ్యాచ్ ఆడటంతో తన బౌలింగ్ లయ దెబ్బతిన్నట్లు సిరాజ్ తెలిపాడు. రన్‌అప్‌లో అడుగులు సరిగ్గా పడకపోవడంతో వేగం తగ్గిందని చెప్పాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో మాత్రం సిరాజ్ తిరిగి లయ అందుకున్నాడు. శ్రీలంక నుంచి వచ్చిన కొన్నిరోజులకే చెన్నై మ్యాచ్ ఆడినా.. దేశం తరఫున ఆడేటప్పుడు సాకులు చెప్పకూడదని స్పష్టం చేశాడు. జట్టు కోసం పూర్తి స్థాయిలో కష్టపడటమే తనకు ముఖ్యమని చెప్పాడు. ఇప్పుడు హైదరాబాద్ కెప్టెన్‌గా సిరాజ్ ముందు మరో సవాలు ఉంది. నాయకత్వంతో పాటు బంతితోనూ సత్తా చాటేందుకు అతడికి రంజీ సీజన్ మంచి అవకాశం కానుంది.



# ఇంగ్లాండ్ గడ్డపై పాక్‌కు ఘోర పరాభవం..

## మూడో టెస్టులోనూ పాకిస్థాన్‌కు ఓటమి

ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన మూడో టెస్టులో ఇంగ్లాండ్ జట్టు 8 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో మూడు టెస్టుల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసి పాకిస్థాన్‌కు ఘోర పరాభవాన్ని మిగిల్చింది. కెప్టెన్‌గా జో రూట్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తర్వాత తొలి సిరీస్‌నే క్లీన్ స్వీప్ చేయడం గమనార్హం. తొలి రెండు టెస్టులతో పోలిస్తే.. మూడో టెస్టులో పాక్ కాస్త పోరాడినా ఓటమిని మాత్రం తప్పించుకోలేకపోయింది. దీంతో నాలుగు రోజుల్లోనే టెస్ట్ మ్యాచ్ ముగిసింది. 130 పరుగుల స్వల్ప లక్ష్యంతో నాలుగో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లాండ్‌కు పాకిస్థాన్ పేసర్ మహమ్మద్ అబ్బాస్ షాక్ ఇచ్చాడు. తొలి బంతికే డకెట్‌ను డకౌట్‌గా వెనక్కి పంపిన అబ్బాస్, అదే ఓవర్లో ఎమిలియో గేని కూడా పెవిలియన్ చేర్చాడు. కేవలం 2 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన ఇంగ్లాండ్‌పై పాక్ పైచేయి సాధించినట్లు కనిపించింది. అబ్బాస్ తన కట్టుదిట్టమైన స్పెల్‌తో ఇంగ్లాండ్ బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. అయితే కెప్టెన్ జో రూట్, జోర్డాన్ కాక్స్ కలిసి ఇంగ్లాండ్‌ను ఆదుకున్నారు. పాకిస్థాన్ బౌలర్ల దాడిని తట్టుకుంటూ నెమ్మదిగా స్కోరు బోర్డును ముందుకు నడిపారు. ఈ క్రమంలో పాకిస్థాన్ చేసిన పొరపాట్లు రూట్‌కు బాగా కలిసివచ్చాయి. మహమ్మద్ అలీ బౌలింగ్‌లో రూట్ బంతిని వికెట్లపైకి ఆడుకున్నప్పటికీ అది నో-బాల్ కావడంతో బ్రతికిపోయాడు. ఆ తర్వాత స్లిప్‌లో క్యాచ్ డ్రాప్ అవ్వడంతో లభించిన అవకాశాలను రూట్ పూర్తిగా సద్వినియోగం చేసుకుని అజేయ హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించాడు. ఒత్తిడిని జయించిన జో రూట్, జోర్డాన్ కాక్స్ మూడో వికెట్‌కు 100కు పైగా పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కాక్స్ కూడా తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకుని ఇంగ్లాండ్ విజయాన్ని ఖరారు చేశాడు. చివరికి 24.2 ఓవర్లలో 130/2 పరుగులు చేసిన ఇంగ్లాండ్ సునాయాస విజయాన్ని అందుకుంది. ఈ ఓటమితో పాకిస్థాన్ ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలు గల్లంతయ్యాయి. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 133 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం ఇంగ్లాండ్ 453 పరుగులు చేసింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో పాక్ బ్యాటర్లు పోరాడారు. దీంతో ఈ సిరీస్‌లోనే తొలిసారి ఆ జట్టు స్కోరు 200 పరుగుల మార్కును దాటింది. చివరకు 449 పరుగులకు ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో ఆలౌట్ అయింది. అనంతరం 130 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్.. 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి.. సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది.

# నేడు ఆఫ్ఘనిస్తాన్ తో టీమిండియా టీ20

- ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియం మ్యాచ్
- సవాల్‌గా మారిన తుది జట్టు ఎంపిక






శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టు ఇటీవలే జింబాబ్వే పర్యటనను దిగ్విజయంగా ముగించుకుంది. ఈ సిరీస్ ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లాండ్ లల్లో చవి చూసిన పరిపూర్ణ ఓటముల గాయాన్ని జింబాబ్వే సిరీస్ కొంతవరకు నయం చేయగలిగింది. ఇక.. మూడు టీ20 మ్యాచ్ ల సిరీస్ ఆడబోతోంది. ఆఫ్ఘనిస్తాన్ తో తలపడబోతోంది. ఈ మూడు మ్యాచ్ లకు ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియం ఆతిథ్యాన్ని ఇస్తోంది. అన్ని మ్యాచ్‌లు రాత్రి 7:30 గంటలకు ప్రారంభమౌతాయి. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న టీమిండియా.. జింబాబ్వేపై సాధించిన విజయ పరంపరను కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. తుది జట్టును ఎంపిక చేయడం పెద్ద సవా వాల్‌గా మారింది. స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ జట్టులోకి తిరిగి రావడంతో ఈక్వేషన్లు మారాయి. జింబాబ్వే పర్యటనకు దూరమైన శాంసన్ ఇప్పటివరకు ఆడిన 14 మ్యాచ్‌ల్లో 180.99 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 400 పరుగులు సాధించాడు. ఇందులో మూడు అర్ధ సెంచరీలు ఉన్నాయి. టీమిండియా ఓపెనింగ్ స్థానం కోసం గట్టి పోటీ నెలకొంది. జింబాబ్వే సిరీస్‌లో వరుసగా రెండు హాఫ్ సెంచరీలు సాధించి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అందుకున్న వైభవ్ సూర్యవంశీ వైపే మేనేజ్‌మెంట్ మొగ్గు చూపే అవకాశం ఉంది. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ ప్రస్తుత ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. గత మూడు మ్యాచ్‌ల్లో అతను కేవలం 11 పరుగులు మాత్రమే చేశాడు. మొదటి మ్యాచ్‌లో అభిషేక్ రాణించకపోతే, మిగిలిన రెండింటికీ సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గా పంపే అవకాశం ఉంది. వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కూడా ఓపెనర్ రేసులో ఉన్నాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్‌పై 270 పరుగుల రికార్డు ఇన్నింగ్స్‌తో ఇషాన్ తన ఫామ్‌ను నిరూపించుకున్నాడు. దీంతో అతను నాలుగో స్థానంలో ఆడే అవకాశాలు ఉన్నాయి. ఇక మిడిల్ ఆర్డర్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, వైస్ కెప్టెన్ తిలక్ వర్మ జట్టుకు వెన్నెముకగా నిలవనున్నారు. ఆల్‌రౌండర్ కోటాలో ఎవరిని ఎంపిక చేయాలనే దానిపై తర్జన భర్జన జరుగుతోంది. శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డిల్లో ఒకరికి అవకాశం దక్కొచ్చు. ఎవరిని ఆడిస్తారనేది పిచ్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. బ్యాటింగ్ డెప్త్ పెంచాలనుకుంటే దూబే వైపు, బౌలింగ్ ఆప్షన్ వైపు మొగ్గు చూపితే నితీష్ రెడ్డిని ఎంపిక చేసే అవకాశం ఉంది. బౌలింగ్ విభాగంలో మేనేజ్‌మెంట్ జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌పై దృష్టి సారించింది. అర్ష్‌దీప్ సింగ్, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ ఈ మ్యాచ్ లో కీలకం కానున్నారు.

# చెన్నై యాజమాన్యం క్లారిటీతో తెరపడిన ఉత్కంఠ

చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీలో ధోనీ వాటాలు కోరారనే ప్రచారం క్రీడా వర్గాల్లో పెద్ద ఎత్తున కలకలం రేపింది. ఈ ఊహాగానాలపై సీఎస్కే యాజమాన్యం అధికారికంగా స్పందిస్తూ స్పష్టత ఇచ్చింది. అదే సమయంలో కొత్త కోచ్ ఎంపిక, రాబోయే ఐపీఎల్ వ్యూహాలపై కూడా కీలక సమాచారం వెలువడింది. చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీలో వాటాలను కొనుగోలు చేయడానికి ధోనీ ఆసక్తి చూపించారని, అయితే ఆయన పెట్టిన షరతులకు యాజమాన్యం అంగీకరించలేదని కొన్ని వార్తలు హల్‌చల్ చేశాయి. ఈ ప్రచారంపై సీఎస్కే పెద్ద అధికారి ఒకరు తీవ్రంగా స్పందించారు. ధోనీ నుంచి అలాంటి ప్రతిపాదన ఏది తమ వద్దకు రాలేదని, ఆయనతో దీనిపై ఎలాంటి చర్చలు జరగలేదని స్పష్టం చేశారు. ఎన్ శ్రీనివాసన్‌తో ఆయన వ్యక్తిగతంగా మాట్లాడారో లేదో తమకు తెలియదని వివరించారు. గతంలో సీఎస్కే షేర్లు ప్రైవేట్ విక్రయానికి అందుబాటులో ఉన్న సమయంలో ధోనీ కొన్ని షేర్లను కొనుగోలు చేసిన




మాట నిజమేనని ఫ్రాంచైజీ వర్గాలు వెల్లడించాయి. ఈ షేర్లు బహిరంగ మార్కెట్లో విక్రయించబడవు కాబట్టి ప్రైవేట్‌గానే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ధోనీ వద్ద లక్షకు పైగా షేర్లు ఉన్నప్పటికీ, మొత్తం ఫ్రాంచైజీ వాటాతో పోలిస్తే అది చాలా చిన్న భాగం మాత్రమే. ప్రస్తుతం శ్రీనివాసన్ కుటుంబం వద్దే 55 శాతానికి పైగా ప్రైవేట్ వాటాలు భద్రంగా ఉన్నాయి. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ధోనీ సెప్టెంబర్ 22 నాటికి భారత్‌కు తిరిగి రానున్నారు. ఆయన స్వదేశానికి చేరుకున్న వెంటనే ఐపీఎల్ 2027 వేలానికి సంబంధించి, అలాగే ఆటగాళ్ల ట్రేడింగ్, బదిలీలపై సీఎస్కే యాజమాన్యం ఒక కీలక సమావేశం నిర్వహించనుంది. ప్రధానంగా సీఎస్కే కొత్త హెడ్ కోచ్ ఎంపికలో ధోనీ పాత్ర అత్యంత కీలకం కానుంది. ఒక విదేశీ దిగ్గజ ఆటగాడిని కోచ్‌గా నియమించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అభిమానుల్లో ఎన్నో సందేహాలు ఉన్నప్పటికీ ధోనీ, సీఎస్కే బంధం ఎప్పటిలాగే బలంగా ఉంది. సెప్టెంబర్ చివరి వారంలో జరగబోయే సీఎస్కే సమావేశం తర్వాత కొత్త కోచ్ ఎవరనే దానిపై పూర్తి స్పష్టత రానుంది.

# 309 ఇన్నింగ్స్‌ల్లో 69వ అర్ధశతకం

## చరిత్ర సృష్టించిన ఇంగ్లాండ్ కెప్టెన్ రూట్

రెడ్ బాల్ క్రికెట్‌లో ఇంగ్లాండ్ రన్‌మెషీన్ జో రూట్ తన సూపర్ ఫామ్ కొనసాగిస్తూ సరికొత్త చరిత్ర సృష్టించాడు. టెస్టు క్రికెట్ చరిత్రలోనే అత్యధిక అర్ధశతకాలు సాధించిన బ్యాటర్‌గా టీమిండియా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ వరల్డ్ రికార్డును రూట్ బద్దలు కొట్టాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మూడో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీ బాదడం ద్వారా రూట్ తన కెరీర్‌లో 69వ టెస్టు ఫిఫ్టీని నమోదు చేసుకున్నాడు. సచిన్ టెండూల్కర్ 329 ఇన్నింగ్స్‌ల్లో 68 ఫిఫ్టీలు సాధించగా, రూట్ కేవలం 309 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ మార్కును దాటేశాడు. ఈ ఇన్నింగ్స్‌తో జో రూట్ మరో భారీ మైలురాయిని చేరుకున్నాడు. ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో 1000 ప్లస్ టెస్టు పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా చరిత్ర పుటలకెక్కాడు. ఒకే వేదికపై నిలకడగా పరుగులు రాబడుతూ ప్రత్యర్థి బౌలర్లకు సింహస్వప్నంగా మారిన రూట్, ఈ మైదానంలో ఇంగ్లాండ్‌కు అనేక చారిత్రాత్మక విజయాలను అందించడంలో కీలక పాత్ర పోషించాడు. నాలుగు వేర్వేరు క్రికెట్ వేదికల్లో 1000 కంటే ఎక్కువ టెస్టు పరుగులు సాధించిన ప్రపంచంలోనే మూడో క్రికెటర్‌గా జో రూట్ నిలిచాడు. గతంలో లార్డ్స్ (2203 రన్స్), మాంచెస్టర్ (1128 రన్స్), ది ఓవల్ (1050 రన్స్) మైదానాల్లో వెయ్యికి పైగా పరుగులు చేసిన రూట్, ఇప్పుడు ఎడ్జ్‌బాస్టన్ (1000o రన్స్)ను కూడా ఆ జాబితాలో చేర్చాడు. క్రికెట్ చరిత్రలో దక్షిణాఫ్రికా దిగ్గజం జాక్వెస్ కల్లిస్, ఆస్ట్రేలియా గ్రేట్ రికీ పాంటింగ్ మాత్రమే ఈ ఘనత సాధించగా, ఇప్పుడు రూట్ వారి సరసన నిలిచాడు. కాగా పాకిస్థాన్‌తో జరిగిన మూడో టెస్టులో ఇంగ్లాండ్.. 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. దీంతో మూడు టెస్టుల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఇక ఇంగ్లాండ్, పాకిస్థాన్ టెస్ట్ సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఇంగ్లాండ్‌కు చెందిన ఓలీ రాబిన్సన్, పాక్ పేసర్ మహమ్మద్ అబ్బాస్ నిలిచారు.



# బుమ్రాను ఎదుర్కొనేందుకు మా వద్ద వ్యూహాలు ఉన్నాయి

## ధీమా వ్యక్తం చేసిన ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్

గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టులోకి వస్తున్న టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను ఎదుర్కోవడానికి తమ వద్ద ప్రత్యేక వ్యూహాలున్నాయని ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్ ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం (సెప్టెంబరు 13) అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగనున్న తొలి టీ20కి ముందు జద్రాన్ మీడియాతో మాట్లాడాడు. బుమ్రా రాకతో భారత బౌలింగ్ విభాగం పటిష్ఠంగా మారినప్పటికీ, అతడిని సమర్థంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశాడు. “జస్ప్రీత్ బుమ్రా ప్రపంచంలోని అత్యుత్తమ బౌలర్లలో ఒకడు. నాకు ఇష్టమైన ఫాస్ట్ బౌలర్ కూడా అతడే. అయితే మేం ఏ విషయాన్నీ క్లిష్టంగా మార్చుకోం. అతడి కోసం మా వద్ద మంచి ప్రణాళిక ఉంది. అతడి బౌలింగ్‌ను ఎలా ఎదుర్కోవాలనే దానిపై స్పష్టమైన అవగాహనతో ఉన్నాం. బుమ్రాతో పాటు భారత జట్టుపైనా మెరుగైన ప్రదర్శన చేస్తామని ఆశిస్తున్నాం” అని జద్రాన్ తెలిపాడు. టీమిండియా యువ సంచలనం, లెఫ్ట్ హ్యాండ్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించామని జద్రాన్ వెల్లడించాడు. “ఐపీఎల్‌లో అతడిని ఎదుర్కొన్న మా జట్టు ఆటగాళ్ల నుంచి కీలక సమాచారం సేకరించాం. ఇప్పటికే అతడి వీడియోలను విశ్లేషించాం. సరైన సమయంలో సరైన ప్రణాళికలను అమలు చేయడంపైనే మా దృష్టి ఉంది” అని వివరించాడు. భారత్‌లో ఆడటం తమకు కొత్తేమీ కాదని, ఇక్కడి పరిస్థితులపై సంపూర్ణ అవగాహన ఉందని జద్రాన్ అన్నాడు. “గతంలో టీ20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్‌లతో పాటు ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడాం. 2024లో బెంగళూరులో జరిగిన టీ20లో రెండు సూపర్ ఓవర్ల వరకు మ్యాచ్ సాగింది. భారత్‌పై మేం ఎప్పుడూ మెరుగైన క్రికెట్ ఆడాం. అయితే ఇప్పటివరకు వారిపై సిరీస్ గెలవలేదు. ఈసారి ఆ రికార్డును బద్దలు కొట్టి సిరీస్ గెలవడమే మా లక్ష్యం” అని పేర్కొన్నాడు. రషీద్ ఖాన్ నుంచి టీ20 కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించడంపై మాట్లాడుతూ, తమ మధ్య మంచి అవగాహన ఉందని, ఇది జట్టుకు మేలు చేస్తుందని తెలిపాడు. కొత్త కోచ్ రిచర్డ్ పైబస్ మార్గదర్శకత్వంలో జట్టు మరింత మెరుగవుతోందని, గతంలో తాము బలహీనంగా ఉన్న అంశాలపై దృష్టి సారించి మెరుగుపరుచుకుంటున్నామని వివరించాడు. భారత గడ్డపై వారికే ఆతిథ్యమివ్వడం తమ క్రికెట్ చరిత్రలో ఒక అపూర్వ ఘట్టం అని జద్రాన్ అభివర్ణించాడు. కెప్టెన్‌గా ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి, సరైన సమయంలో సరైన నిర్ణయాలు ఎలా తీసుకోవాలనే దానిపై దృష్టి పెడుతున్నానని, ఈ కొత్త బాధ్యతను ఆస్వాదిస్తున్నానని అన్నాడు.




# నా సినిమాలను నేను చూడలేను



ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతి జింటా కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కొంత విరామం తర్వాత ఆమె 'వైబ్' అనే యాక్షన్ కామెడీ మూవీతో పాటు 'బట్వారా 1947' చిత్రం గ్రాండ్ రీఎంట్రీ ఇస్తోంది. 'వైబ్'లో ఆమె 'మేడమ్ హెచ్' అనే పవర్‌ఫుల్ సూపర్ స్పై పాత్రలో కనిపించనున్నారు. వంశిక ధీర్, కునాల్ ఖేము, స్పర్ష్ శ్రీవాస్తవ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా జరిగిన ప్రమోషన్లలో నటి వంశిక ధీర్ మాట్లాడుతూ... పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు 'ఇంపాస్టర్ సింట్రోమ్' అనిపించిందని చెప్పగా, ప్రీతి జింటా ఆసక్తికరంగా స్పందించింది. ఇన్ని ఏళ్ల అనుభవం ఉన్నా, ప్రతి కొత్త పాత్ర చేసేటప్పుడు 'చేయగలనా, లేదా?' అనే సందేహం తనకూ వస్తుందని ఆమె చెప్పింది. "నేను నా సినిమాలను స్క్రీన్ పై ఎప్పుడూ చూడలేను. థియేటర్‌లో కూర్చోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపు ఈ సీన్ ఇంకా బాగా చేసి ఉంటే బాగుండేది అనే ఆలోచనే వస్తుంది" అని ప్రీతి వెల్లడించింది.

# నవ్వులు పూయిస్తున్న 'ఆదర్శ కుటుంబం' టీజర్


వెండితెరపై కుటుంబ కథా చిత్రాలకు సరికొత్త నిర్వచనం చెప్పిన విక్టరీ వెంకటేష్ , మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్లో తెరకెక్కిన మోస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'ఆదర్శ కుటుంబం'. మొదటి నుంచి సినీ ప్రియులను విశేషంగా ఆకర్షిస్తున్న ఈ చిత్రం నుంచి ఎట్టకేలకు ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూసిన టీజర్ అధికారికంగా విడుదలైంది. తొలుత ప్రకటించిన సమయానికి కాస్త ఆలస్యమైనప్పటికీ చిత్ర బృందం రీ-షెడ్యూల్ చేసిన సమయానికి టీజర్‌ను యూట్యూబ్ వేదికగా విడుదల చేసి అభిమానులకు పసందైన వినోదాన్ని పంచింది. తాజాగా విడుదలైన 'ఆదర్శ కుటుంబం' టీజర్ ఆద్యంతం ఆహ్లాదకరమైన వినోదం, ఆకట్టుకునే భావోద్వేగాలతో సాగింది. విక్టరీ వెంకటేష్ మార్క్ సహజ నటన, టైమింగ్‌తో పలికించిన సంభాషణలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మరోవైపు త్రివిక్రమ్ తనదైన శైలి చమత్కారమైన డైలాగ్స్, కుటుంబ బంధాల ప్రాధాన్యతను చాటే సన్నివేశాలతో మరోసారి మ్యాజిక్ చేశారు. వెంకీలోని ఫ్యామిలీ మ్యాన్ ఇమేజ్‌ను, త్రివిక్రమ్ రాతలోని పదునును సరిగ్గా మేళవించి ఈ చిత్రాన్ని పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా మలిచినట్లు టీజర్ స్పష్టం చేస్తోంది. డబ్బుకి సబ్బుకి ఓ పోలికుంది... మొదటిది చూస్తుండగానే కరిగిపోద్ది, రెండో ఆలోచించేలోపే అరిగిపోద్ది, అడుక్కునేవాళ్లకైనా ఆదివారం ఉంటుంది గానీ ఈ అప్పులోళ్లకి ఉండదు' అనే డైలాగ్స్ త్రివిక్రమ్ మార్క్‌ని చూపిస్తున్నాయి. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయి-న్‌గా నటిస్తుండటంతో మొదటి నుంచే ఈ జోడీపై ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తి ఉంది. టీజర్‌లో ఆమె స్క్రీన్ ప్రెజెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వెంకటేష్‌తో ఆమె మధ్య వచ్చే సన్నివేశాలు చాలా ఫ్రెష్‌గా ఉండటంతో పాటు ఆమె పాత్రకు కూడా కథలో బలమైన ప్రాధాన్యత ఉన్నట్లు విజువల్స్ చూస్తే అర్థమవుతోంది. ఇప్పటివరకు సినిమా నేపథ్యంపై పూర్తి గోప్యత పాటించిన చిత్ర బృందం.. ఈ టీజర్ ద్వారా కథా వాతావరణాన్ని, పాత్రల స్వభావాన్ని పరిచయం చేస్తూ అంచనాలను ఒక్కసారిగా రెట్టింపు చేసింది. ఫ్యామిలీ ఫన్, ఎమోషన్స్‌తో పాటు క్రైమ్ అంశాలు కూడా ఈ కథలో జోడించినట్లుగా టీజర్ చూస్తుంటే అర్థమవుతోంది. మరోవైపు ఈ మూవీ రిలీజ్ వాయిదా అంటూ జరుగుతోన్న ప్రచారానికి మేకర్స్ మరోసారి చెక్ పెట్టారు. 'ఆదర్శ కుటుంబం' అక్టోబర్ 2నే థియేటర్లలోకి రానుందని టీజర్ ద్వారా అధికారికంగా ప్రకటించారు.



# తెలుగులోకి 'హనుమాన్ అంశ్'

రూ. 2 కోట్లతో తీసిన సినిమా బాక్సాఫీస్ వద్ద రూ. 150 కోట్లకు పైగా కలెక్ట్ చేసిందంటే ఎవరైనా షాక్ అవ్వాల్సిందే. అది కూడా ఎలాంటి స్టార్ కాస్ట్, ప్రమోషన్లు, అంచనాలు లేకుండా సైలెంట్ బాలీవుడ్ లో రిలీజ్ అయిన ఓ చిన్న సినిమా గురించి ఇప్పుడు యావత్ దేశం మొత్తం మాట్లాడుకుంటుంది. అదే "హనుమాన్ అంశ్" చిత్రం.. ఈ సినిమాను ఇంతలా ఆదరించడానికి గల కారణం ఏంటి..? అని అనుకుంటున్నారా..? ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలీ బాబా జీవితం ఆధారంగా ఈ సినిమా రూపొందింది. కేవలం ప్రేక్షకుల మౌత్ టాక్ తో పుంజుకుని ఇప్పుడు ఏకంగా రూ. 150 కోట్లకు పైగా కలెక్షన్లు కొల్లగొట్టింది. అయితే ఇప్పుడు ఈ మూవీ తెలుగులోనూ రాబోతోంది. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ హనుమాన్ అంశ్ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. త్రివిక్రమ్ సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 18 న తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేయనుంది. నీమ్ కరోలి బాబా భక్తుల భావోద్వేగాలను, ఆయన జీవితంలోని ముఖ్య ఘట్టాలను అద్భుతంగా ఆవిష్కరించిన ఈ ఆధ్యాత్మిక సినిమా తెలుగు ప్రేక్షకులను కూడా ఎంతగానో ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. భక్తి రస చిత్రాలను ఆదరించడంలో తెలుగు ప్రేక్షకులు ముందుంటారు. ఆ కారణంతోనే ఈ సినిమాను తెలుగులోనూ రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. ఇక హనుమాన్ అంశ్ చిత్రానికి విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించారు. అలాగే ఈ చిత్రంలో శోభినావ్ సత్య, విహాన్ శెడ్గే ప్రధాన పాత్రల్లో నటించారు.

# కొత్త సినీ యుగానికి శ్రీకారం శ్రీమద్భాగవతం




సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ భారతీయ సినిమా ప్రపంచంలో ఒక నూతన శకానికి శ్రీకారం చుడుతోంది. ఒకప్పుడు 'రామాయణ్', 'శ్రీ కృష్ణ' వంటి అజరామరమైన దృశ్య కావ్యాలతో కోట్లాది మంది భారతీయుల ఇళ్లల్లో, హృదయాల్లో భక్తిపరవశాన్ని నింపిన రామానంద్ సాగర్ కుటుంబం.. ఇప్పుడు అదే ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని వెండితెరపై అత్యంత వైభవంగా ఆవిష్కరించేందుకు సిద్ధమైంది. భారతీయ పురాణ చరిత్రలోనే అత్యంత విస్తృతమైన కథా సముద్రం 'శ్రీమద్భాగవతం'. ఈ పవిత్ర గాథను కేవలం రెండు మూడేళ్ల వ్యవధిలో లేదా ఒకే సినిమాలో చూపించడం సాధ్యం కాదు. అందుకే దీనిని ఒక భారీ సినిమాటిక్ యూనివర్స్‌గా మలచి, మొత్తం ఏడు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ ఆధ్యాత్మిక మహాగాథలో తొలి అడుగుగా 'శ్రీమద్భాగవతం: పార్ట్ వన్ - విష్ణురథ' రూపుదిద్దుకుంటోంది. దివంగత రామానంద్ సాగర్ వారసత్వపు బాధ్యతలను ఆయన మనవళ్లు ఆకాశ్ సాగర్ చోప్రా, అమృత్ సాగర్ తమ భుజస్కంధాలపై వేసుకున్నారు. '1971' చిత్రంతో జాతీయ చలనచిత్ర పురస్కారాన్ని అందుకున్న అమృత్ సాగర్, అనుభవజ్ఞుడైన ఆకాశ్ సాగర్‌తో కలసి ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. పాత తరం భావోద్వేగాలను, భక్తి శ్రద్ధలను కాపాడుతూనే.. నేటి తరం ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఆధునిక సినిమాటిక్ శైలిలో ఈ కథను మలుస్తున్నారు. హైదరాబాద్‌లోని ప్రసిద్ధ రామోజీ ఫిల్మ్ సిటీలో వైభవంగా ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ కోసం అత్యంత భారీ సెట్లు, అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రాచీన పౌరాణిక ప్రపంచాన్ని విజువల్ వండర్‌గా మార్చేందుకు అంతర్జాతీయ సాంకేతిక నిపుణులు భాగస్వాములవుతున్నారు. వంటి ప్రపంచ ప్రసిద్ధ చిత్రాలు, సిరీస్‌లకు పనిచేసిన ప్రముఖ విజువల్ ఎఫెక్ట్స్ నిపుణుడు క్లైడ్ ఎడ్వర్డ్స్ ఈ చిత్రానికి పనిచేస్తుండటం విశేషం. కేవలం గ్రాఫిక్స్ కోసమే కాకుండా, కథలోని ఆధ్యాత్మిక లోతును, సాంస్కృతిక మూలాలను చెడగొట్టకుండా అత్యాధునిక సాంకేతికతతో దృశ్య రూపం ఇస్తున్నారు. ఇది కేవలం మరొక భక్తి చిత్రం కాదు, సాంస్కృతిక మూలాలు, కుటుంబ వారసత్వం, ఆధునిక సాంకేతికత , భారీ నిర్మాణం కలగలిసిన ఒక అరుదైన సినీ ప్రయోగం. మన ప్రాచీన పురాణ వైభవాన్ని నేటి ఆధునిక తరానికి వారి భాషలోనే, అంతర్జాతీయ ప్రమాణాలతో అందించడమే లక్ష్యంగా 'విష్ణురథ' థియేటర్లలోకి రాబోతోంది. రామాయణంతో మొదలైన సాగర్ కుటుంబ పయనం.. ఇప్పుడు 'శ్రీమద్భాగవతం'తో భారతీయ వెండితెరపై ఒక నూతన విజువల్ వండర్‌కు తెరదీస్తోంది.

# స్పై డ్రామాతో సీక్రెట్ సోల్జర్..

నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా 'సీక్రెట్ సోల్జర్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్‌ను క్రియేట్ చేసింది. యూనిక్ కాన్సెప్ట్, ఆకట్టుకునే ప్రెజెంటేషన్, యాక్షన్, థ్రిల్, హ్యూమర్ ఎలిమెంట్స్‌తో విడుదలైన టీజర్ ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. 'చైనా పీస్'గా మొదలైన ప్రయాణం 'సీక్రెట్ సోల్జర్'గా ఎలా మారింది అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'చైనా పీస్' పేరుతోనే టీజర్ రిలీజ్ చేశాను. అలాగే రెండు పాటలు కూడా విడుదల చేశాను. అదే పేరుతో చాలా మార్కెటింగ్ చేశాం.




మార్చిలో సినిమా రిలీజ్ చేద్దామని సెన్సార్‌కు పంపించాను. సెన్సార్ నుంచి అభ్యంతరాలు వచ్చాయి. రివ్యూ కమిటీలు, ఈబీసీ చైర్మన్, మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్.. ఇలా అన్ని స్థాయిలు దాటుకుని లిస్టు పంపించారు. అందులో మొదటి పాయింట్.. టైటిల్ 'చైనా పీస్' ఉండకూడదు. ఈ కథ ఆలోచన, ఉద్దేశంతో ఆలోచించుకుని 'సీక్రెట్ సోల్జర్' అయితే బాగుంటుందని ఆ టైటిల్ పెట్టాం. సెన్సార్‌లో దాదాపు 8 నెలలు ఈ సినిమా ఉన్నప్పటికీ, మేం ఏ ఆలోచనతో సినిమా తీశామో.. ఆ ఆలోచన విషయంలో ఎలాంటి ఇబ్బంది రాలేదు. మా డైరెక్టర్ విశ్వనాథ్ గారు చాలా కష్టపడ్డారు. కంటెంట్ విషయంలో తగ్గించడానికి ఎక్కడా కూడా రాజీ పడలేదు. విజువల్స్ పరంగా చాలా చిన్న కట్స్ మాత్రమే వచ్చాయి. ఇది స్పై డ్రామా. ఇందులో స్పై యాక్షన్ కూడా చాలా రియలిస్టిక్‌గా ఉంటుంది. ఇండియా కి సంబధించిన ఓ కీలక ఇన్ఫర్మేషన్ లీక్ అయింది. ఆ సంఘటనకి నెల్లూరులో చాలా సాదాసీదాగా బతికే ఇద్దరు కుర్రాళ్లకి లింక్ ఏమిటి? ఆ సమస్యను పరిష్కరించగలిగారా లేదా? అనేది ఒక లైన్. ఫస్ట్ హాఫ్ లో ఫ్రెండ్‌షిప్ ఎమోషన్స్ చాలా బాగుంటాయి. మా ఇద్దరి క్యారెక్టర్స్ ఈ వరల్డ్‌లోకి ఎలా వచ్చాయి అనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. మంచి హ్యూమర్, ట్విస్టులు ఉంటాయి. ఫైనల్‌గా సినిమా ఒక మంచి ఫ్రెండ్‌షిప్ కథగా కూడా ఉంటుంది. స్నేహం, దేశభక్తి.. ఈ రెండు ఎమోషన్స్‌తో ఇప్పటివరకు చాలా తక్కువ సినిమాలు వచ్చాయి. ఇందులో అలాంటి ఒక కొత్త ఎమోషన్‌ను ఆడియన్స్ చూడబోతున్నారు. కచ్చితంగా ఈ సినిమాతో మమ్మల్ని గుర్తుపెట్టుకుంటారు అని చెప్పుకొచ్చారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com